ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

కడప

జిల్లా వార్తలు

5

బుధవారం 20 ఆగస్టు 2025



15వ ఆర్థిక సంఘం నిధులు బదిలీ చేయాలి

వేంపల్లె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను వెంటనే పంచాయతీలకు బదిలీ చేయాలని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఏడాది సెప్టెంబరులో రూ.989కోట్లు, డిసెంబరులో రూ.1,121కోట్లు 15వ ఆర్థిక సంఘం కింద కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని తెలిపారు. ఈ నిధులు అందిన 10 రోజుల్లో రాష్ట్రప్రభుత్వం గ్రామ పంచాయతీలకు బదిలీ చేయాలని.. కానీ పది నెలలు అయినా ఇంతవరకు బదిలీ చేయలేదని పేర్కొన్నారు.



డీసీఎస్ఆర్ కాలనీలోని భారీ భవంతి



రాజేశ్వరి కాలనీలో కట్టిన భారీ భవంతులు

కబ్జా కోరల్లో వక్ఫ్ భూములు



- రూ.కోట్ల విలువైన స్థలాలు అన్యాక్రాంతం
- జిల్లాలో 1,960 ఎకరాల్లో 1,000 ఎకరాల ఆక్రమణ
- యథేచ్ఛగా సాగుతున్న కట్టడాలు
- రీసర్వేచేసి ఆక్రమణల తొలగింపునకు డీఆర్వో ఉత్తర్వులు
- రెండువారాలు గడిచినా కదలని రెవెన్యూ యంత్రాంగం

ప్రొద్దుటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొన్నేళ్లుగా వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. రికార్డు పరంగా జిల్లా వ్యాప్తంగా 1960 ఎకరాలు వక్ఫ్‌బోర్డుకు చెందినవిగా గెజిట్ నోటిఫికేషన్ ఉన్నప్పటికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ భూములకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఇప్పటికే 1000 అన్యాక్రాంతం అయ్యాయి. రూ.వందల కోట్ల విలువ చేసే ముస్లిం మైనార్టీలకు చెందిన భూములు అన్యాక్రాంతం అవుతున్నా జిల్లాలో ఆ వర్గానికి చెందిన నేతలు మిన్నకున్నారు. ఇందులో కొందరికి ఈ కబ్జాలలో హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అందువల్లే వారు అధికార పార్టీలో ఉన్నా ప్రతిపక్ష పార్టీల్లో ఉన్నా నోరు మెదపడం లేదని ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. ప్రొద్దుటూరులోని వక్ఫ్ భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాలకు అనేక మార్లు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్లు నోటీసులు ఇచ్చారు. నోటీసులు ఇచ్చి చర్యలు ప్రారంభం కాగానే ఆ ఇన్‌స్పెక్టర్లు బదిలీపై వెళుతున్నారు. గత ఐదేళ్లకాలంలో దాదాపు ఏడుగురు ఇన్‌స్పెక్టర్లు మారారంటే కబ్జాదారులు ఏ స్థాయిలో పైవారిని ప్రభావితం చేస్తున్నారో స్పష్టం అవుతోంది.

వక్ఫ్ భూముల్లో కట్టడాలు

- ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ మోడమీది పల్లె సర్వేనెంబరు 278 /1లో రూ.15కోట్ల విలువ చేసే 1.02 ఎకరాల వక్ఫ్ భూమి ఉంది. ఈ భూమిలో 33 సెంట్లలో 6 పెద్ద పెద్ద భవంతులు నిర్మించారు. ఆ సర్వేనెంబరులోనే ఇప్పటి వరకు దాదాపు 75 సెంట్ల మేర అక్రమంగా కట్టడాలు నిర్మించారు.
- మోడమీది పల్లె సర్వేనెంబరు 260లోని 1.23 ఎకరాలు ఉంది. రాజరాజేశ్వరి కాలనీలో ఉన్న ఈ స్థలంలో భారీ అంతస్తుల భవనాలు నిర్మించారు. మరి కొందరు ఇటీవలే చాయ్‌బంక్‌లు, కారు పార్కింగ్ షెడ్లు నిర్మించారు.
- కొత్తపల్లె గ్రామ పొలంలోని ఆటోనగర్‌లో 565 సర్వేనెంబరులో 73 సెంట్ల విలువైన స్థలంలో అక్రమంగా షెడ్లు నిర్వహిస్తున్నారు. వాటిలో కొన్ని భూముల క్రయవిక్రయాలు సైతం జరిగాయి. మార్కెట్‌లో ఈ స్థలం విలువ రూ.15 కోట్ల మేర ఉంటుంది.
- తాళ్లమాపురంలో 319, 440, 442 సర్వే నెంబర్లలో 15 ఎకరాలు, కామనూరులోని సర్వేనెంబరు 570, 636/బి,658 ,696/ఏ, 714లలో 13 ఎకరాలు, కల్లూరులోని సర్వేనెంబరు 833లో 3.95 ఎకరాల వక్ఫ్ భూములు ఆక్రమణలో ఉన్నాయి.

ఆక్రమణల తొలగింపునకు డీఆర్వో ఉత్తర్వులు

మే, జూన్ నెలల్లో ఫరీద్ బాషా, మబూషరీఫ్ అనే ఇద్దరు ముస్లిం మైనారిటీ వ్యక్తులు వక్ఫ్ భూముల ఆక్రమణలపై డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు ఫిర్యాదు చేయడంతో పాటు ఆధారాలను అందజేశారు. దీంతో కొత్తపల్లె పంచాయతీ తాళ్లమాపురం, మోడమీద పల్లె ప్రొద్దుటూరు పొలాల్లో మొత్తం 37.21 ఎకరాల వక్ఫ్ భూములను రీ సర్వే చేసి హద్దులు పాతి అక్రమ కట్టడాలను నిలిపి వేసేలా చర్యలు తీసుకోమని డీఆర్వో ఆదేశించారు. అలాగే అక్రమ కట్టడాలన్ని తొలగించాలని ఈ నెల 4 వతేదీన ప్రొద్దుటూరు తహశీల్దారు, కొత్తపల్లె పంచాయతీ కార్యదర్శి, టూటౌన్ పోలీసు అధికారులను ఆదేశించారు.



నోటీసులు అందుకున్న భవనాలు

రెండువారాలు గడిచినా..

వక్ఫ్ భూముల్లో రీసర్వే చేసి ఆక్రమణలు తొలగించాలంటూ డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఉత్తర్వులు ఇచ్చి రెండు వారాలైంది. వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ వసీమ్ అక్రమ్ గత గురువారం ప్రొద్దుటూరు తహశీల్దారు గంగయ్యను సైతం కలిశారు. తహశీల్దారు సర్వే చేస్తాంలే అని చెప్పడం తప్ప ఎప్పుడు మొదలు పెడతారో స్పష్టంగా వెల్లడించలేదని.. డీఆర్వో ఉత్తర్వులపై రెవెన్యూ, పంచాయతీ, పోలీసు అధికారులు ఇప్పటికి స్పందించడం లేదని వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ వసీమ్ అక్రమ్ ఆరోపిస్తున్నారు.

ఉపాధ్యాయ ఖాళీలపై ఆరా

- 1,622 పోస్టులు గుర్తించినట్లు సమాచారం
- నేడో రేపో తుది మెరిట్ జాబితా విడుదల



కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఎదుర్కొంటున్న ప్రభుత్వ పాఠశాలల్లో మెగా డీఎస్సీ ద్వారా నియామకాలను పూర్తిచేసేందుకు విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. జిల్లాల వారీగా ఖాళీల వివరాలను పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. డీఎస్సీ-2025లో ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో నోటిపై చేసిన మొత్తం పోస్టుల సంఖ్యను మేనేజ్‌మెంట్, కేటగిరీ, మీడియం, సబ్జెక్టు వారీగా పంపాలని సూచించారు. ఈనెల 31వ తేదీ నాటికి ఏర్పడే ఖాళీల సంఖ్యను ఇదే ఫార్మాట్‌లో అందచేయాలని కోరారు. పాఠశాలల వారీగా వేకెన్సీల వివరాలు, అసలు టీచరే లేకుండా కేటగిరీ-3/4ల్లో ఉన్న స్కూల్స్ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో నూతన స్థానాలకు బదిలీ అయినా రిలీవర్ లేక పాత స్కూల్‌లోనే కొనసాగుతుంటే ఆ స్కూల్ వివరాలు, 50శాతం మందికి పైబడి టీచర్లు లేని పాఠశాలలు, కేటగిరీ-3/4ల్లోని స్కూళ్లలో ఇంకా ఎన్ని వేకెన్సీలు భర్తీచేయాలి.. మొదలైన వివరాలను సేకరించడానికి ఉమ్మడి జిల్లా స్థాయిలో ఇప్పటికే బృందాలను నియమించి క్షేత్రస్థాయి నుంచి డేటా తీసుకుంటున్నారు.

జిల్లాలో ఖాళీల వివరాలు

ఉమ్మడి జిల్లాలో ఆదివారం నాటికి 1,622 ఖాళీలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో గ్రేడ్-2 హెచ్‌ఎంలు 25, స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి తెలుగు 53, ఉర్దూ 16, సంస్కృతం 2, ఇంగ్లీష్ 29, గణితం 45, ఉర్దూ గణితం 8, ఫిజికల్ సైన్స్ తెలుగు 39, ఫిజికల్ సైన్స్ ఉర్దూ 11, బయలాజికల్ సైన్స్ తెలుగు 84, బయలాజికల్ సైన్స్ ఉర్దూ 12, సోషల్ స్టడీస్ తెలుగు 80, సోషల్ స్టడీస్ ఉర్దూ 18, ఫిజికల్ ఎడ్యుకేషన్ 103, స్పెషల్ ఎడ్యుకేషన్ 13, పీఎస్ హెచ్‌ఎం తెలుగు 41, పీఎస్ హెచ్‌ఎం ఉర్దూ 3, ఎస్జీటీ తెలుగు 809, ఎస్జీటీ ఉర్దూ 136.. మొత్తం 1622 ఖాళీలు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు.

జాప్యానికి కారణాలు

డీఎస్సీ మెరిట్ జాబితా విడుదలలో జాప్యానికి పలుకారణాలు కనిపిస్తున్నాయి. టెట్ మార్కులను కొందరు అభ్యర్థులు తప్పులతడకగా పొందుపరచడం, నార్మలైజేషన్ ప్రక్రియలు, న్యాయస్థానాల్లో ఉన్న అభ్యంతరాలను అధిగమించడం, వరుస సెలవుదినాలు రావడం తదితర కారణాలతో విడుదల ఆలస్యమవుతోందనే ప్రచారం సాగుతోంది. టెట్ మార్కులపై అభ్యంతరాలను స్వీకరించి మారిన మార్కులతో సవరించిన డీఎస్సీ తుది మార్కుల స్కోర్ కార్డులను ఈనెల 14న విడుదల చేశారు. ఏపీ డీఎస్సీ వెబ్‌సైట్‌లో మార్కులు ఉంచారు. ఇంకా టెట్ మార్కులపై ఎవరికైనా అభ్యంతరాలుంటే ఆన్‌లైన్‌లో పంపవచ్చని సూచించారు. అలా వచ్చిన వాటిని పరిశీలించి తుది మెరిట్ జాబితాను ప్రకటించనున్నారు. తుది జాబితా నేడో రేపో విడుదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అనంతరం మెరిట్ కమ్‌రోస్టర్ విధానంలో టీచర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జిల్లాలో డీఎస్సీ పోస్టులకు సంబంధించి అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనకు ప్రతి 50 మందికి ఒక బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి జిల్లాలో 15 బృందాలను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ప్రతిబృందంలో ఒక ఎంఈఓ, హెచ్‌ఎం, డిప్యూటీ తహశీల్దార్ ఉండేలా చర్యలు చేపట్టారు. కాగా.. గతంలో ఇచ్చినట్లు డీఎస్సీలో టాపర్లు, కటాఫ్ మార్కులు, మెరిట్ లిస్టులు ఇవ్వకుండా నేరుగా సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టాలని అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

శాంతియుత వాతావరణంలో గణేశ్ ఉత్సవాలు జరపాలి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి చిత్రంలో ఎస్పీ అశోక్‌కుమార్, జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శాంతియుత, ఆహ్లాదకరమైన వాతావరణంలో వినాయక ఉత్సవాలను జరుపుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో శాంతికమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ అశోక్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత సామరస్యానికి జిల్లా ప్రసిద్ధి చెందిందన్నారు. అన్ని మతాల ప్రజల సహకారంతో, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి గణేశ్ ఉత్సవాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా విజయవంతం చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలన్నారు. ఇతరులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం నిర్దేశించిన మేరకు మాత్రమే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను, రిస్క్ బోట్లను ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రాంతాలు, వీధుల వారీగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్న ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు ముందస్తుగా అన్ని రకాల అనుమతులు పొందాలన్నారు. ఇందుకు శాంతి కమిటీ సభ్యుల సహకారం అవసరమన్నారు. ఉత్సవాలకు సంబంధించి ఎలాంటి రుసుమును పోలీసు శాఖ వసూలు చేయడం లేదన్నారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తేవాలని కమిటీ సభ్యులకు సూచించారు. కడపలో 250, ప్రొద్దుటూరులో 150 సీసీకెమెరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మేజర్ ప్రాంతాల్లో డ్రోన్ గస్తీ నిర్వహించాలన్నారు ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు జాన్ఇర్విన్, చంద్రమోహన్, సాయిశ్రీ, కడప కమిషనర్ మనోజ్ రెడ్డి, గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మునగా సతీశ్, లక్ష్మీ నారాయణ రెడ్డి, వీహెచ్‌పీ అధ్యక్షుడు చెన్న కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యూరియా అక్రమంగా విక్రయిస్తే చర్యలు

- రైతులకు యూరియా కొరత లేదు
- కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ అవసరాల నిమిత్తం ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియాను అక్రమంగా విక్రయించినా, ఇతర అవసరాలకు మళ్లించినా చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి హెచ్చరించారు. సబ్సిడీ యూరియాను పరిశ్రమల అవసరాలకు మళ్లిస్తున్నారన్న విషయంపై వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులతో మంగళవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా వినియోగంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వ్యవసాయంతో పాటు యూరియాను వినియోగిస్తున్న పరిశ్రమలను గుర్తించాలన్నారు. వారి అవసరాలకు ఎక్కడి నుంచి యూరియాను కొనుగోలు చేస్తున్నారన్న వివరాలపై ఆరా తీయాలన్నారు. జిల్లాలో వివిధ రకాల పరిశ్రమల్లో యూరియా సమ్మేళనాలను ఉపయోగిస్తారన్నారు. ప్రోటీన్‌కు ప్రత్యామ్నాయంగా జంతువులు, కోళ్లకు మేతగా కూడా యూరియా సమ్మేళనాలను వినియోగిస్తుంటారన్నారు. ఇలాంటి పరిశ్రమలపై తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. యూరియాను అధిక ధరలకు అమ్ముతుంటే జిల్లా వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు 8331057300, 9491940106, 8919081933కు సమాచారం ఇవ్వాలన్నారు. జిల్లాలో వ్యవసాయ అవసరాల కోసం ఇప్పటికే 7,186 టన్నుల యూరియాను సరఫరా చేశామన్నారు. ప్రస్తుతం 3,366 టన్నుల యూరియా కోసం ఇండెంట్ పంపించామన్నారు. జిల్లాలో రైతులకు అవసరమైన యూరియా సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్, మార్క్‌ఫెడ్ డీఎం పరిమళ జ్యోతి తదితరులు పాల్గొన్నారు

బాబుతో టీడీపీ నేతల భేటీ వాయిదా

కడప, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మంగళవారం జరగాల్సిన జిల్లా టీడీపీ నేతల భేటీ వాయిదా పడింది. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ బంపర్ మెజార్టీతో గెలుపొందింది. పులివెందులలో వైసీపీకి డిపాజిట్ కూడా రాలేదు. ఈ నేపథ్యంలో జిల్లా టీడీపీ నేతలను అభినందించేందుకు గాను ఉండవల్లిలో చంద్రబాబుతో అపాయింట్‌మెంట్ ఖరారయింది. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్యేలు ఆర్.మాధవి, పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, జడ్పీటీసీ సభ్యులు మారెడ్డి లతారెడ్డి, అద్దలూరు ముద్దుకృష్ణారెడ్డి ఇతర టీడీపీ నేతలు విజయవాడకు వెళ్లారు. కాగా నందమూరి జయకృష్ణ సతీమణి పద్మజ మృతిచెందడంతో చంద్రబాబు, లోకేశ్ హైదరాబాద్ వెళ్లారు. దీంతో జిల్లా నేతలతో భేటీ వాయిదా పడింది. బుధ గురువారాల్లో లేదా మరో తేదీన జరిగే అవకాశం ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. కాగా.. రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును జిల్లా నేతలు కలిశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలను, గెలుపొందిన అభ్యర్థులను పల్లా అభినందించారు. జిల్లా రాజకీయాలపై, నామినేటెడ్ పోస్టులపై చర్చించారు.


పెరిగిన మహిళా ప్రయాణికులు

- ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి



కడప మారుతీనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పించడంతో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని ఆర్టీసీ కడప ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి వెల్లడించారు. బంధువులను చూసేందుకు, ఆలయాలను దర్శించుకునేందుకు మహిళలు పెద్దసంఖ్యలో బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారన్నారు. ఆ మేరకు మంగళవారం స్థానిక ఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 16వ తేదీ శనివారం కడప రీజియన్ పరిధిలోని ఆరు డిపోలద్వారా పురుషులు 60,207 మంది టికెట్లు తీసుకుని ప్రయాణం చేయగా అదేరోజు మహిళలు 52,245 మంది ఉచితంగా ప్రయాణం చేశారన్నారు. 17వ తేదీ ఆదివారం పురుషులు 86,539 మంది, మహిళలు 69,705 మంది ప్రయాణించారన్నారు. సోమవారం అత్యధికంగా 87,267 మంది మహిళలు ప్రయాణం చేశారన్నారు. మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తున్నప్పటికీ వారికయ్యే చార్జీల మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి భర్తీ చేస్తుందన్నారు. ఇక బస్సుల్లో పురుషులకంటే మహిళా ప్రయాణికులే ఎక్కువ ఉండే అవకాశం ఉందన్నారు. ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు మహిళా ప్రయాణికులతో మర్యాదగా మెలగాలన్నారు. ఆ క్రమంలో ప్రయాణికులు కూడా అంతే మర్యాదతో సిబ్బంది పట్ల మెలగాలని కోరారు.





గొట్టిమానుకోనలో జలకళ



చిట్వేలి-రాపూరు రోడ్డులో పచ్చదనం

మనసును హత్తుకునేలా...

- వెలుగొండ అందాలు చూడతరమా...

గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో వెలుగొండ అడవి అందాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ఈ అడవికి దగ్గరగా ఉన్న గొట్టిమానుకోన మినీ రిజర్వాయర్ నీటితో కళకళలాడుతోంది. చిట్వేలి-రాపూరు రోడ్డు ఊటీని తలపించేలా ఆకట్టుకుంటోంది. మేఘాలు కొండలను తాకినట్లుగా కనిపిస్తున్నాయి. నాలుగు నెలలుగా కాసిన ఎండలకు అడవి రూపురేఖలు మారిపోయింది. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలకు అడవిలో పచ్చదనం పరుచుకుంది. రాపూరు ఘాట్ రోడ్డులో ప్రయాణించేవారు అడవి అందాలను చూసి మైమరచిపోతున్నారు.

-రైల్వేకోడూరు (ఆంధ్రజ్యోతి)

కోర్టు ఉద్యోగాలకు నేటి నుంచి పరీక్షలు

- జిల్లా ప్రధాన జడ్జి యామిని



కడప రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని ఆయా కోర్టులలో ఖాళీగా ఉన్న పోస్టులకు బుధవారం నుంచి 24వ తేదీ వరకు ఐదు రోజుల పాటు రాత పరీక్షలు నిర్వహించనున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో జడ్జి మీడియాతో మాట్లాడారు. ఈ పరీక్షలకు కడప నగరంతో పాటు రాయచోటి, ప్రొద్దుటూరులో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు ప్రతి రోజు మూడు షిఫ్టులలో నిర్వహిస్తున్నామన్నారు. మొదటి షిఫ్ట్ ఉదయం 7-30 గంటల నుంచి 11 గంటల వరకు, రెండవ షిఫ్ట్ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2-30 వరకు, మూడో షిఫ్ట్ మధ్యాహ్నం 2-30 గంటల నుంచి 6 గంటల వరకు ఉంటుందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న కోర్టు పరీక్షలలో ఎలాంటి అవకతవకలకు, ప్రలోభాలకు అవకాశం లేదన్నారు. పూర్తి మెరిట్ ప్రకారం ఎంపిక జరుగుతుందన్నారు. డ్రైవర్, టైపిస్టు, కాపీయిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులకు స్కిల్ టెస్టు నిర్వహిస్తామన్నారు. పరీక్షలకు హాజరయ్యేవారి వద్ద హాల్ టికెట్‌తో పాటు గుర్తింపు కార్డు తప్పక ఉండాలన్నారు. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే హాజరుకావాలన్నారు. నిర్ణీత సమయం దాటిన తరువాత ఎవరినీ లోనికి అనుమతించమన్నారు.

గుర్రంకొండలో చోరీ.. పీలేరులో ప్రత్యక్షం



పీలేరు టోల్‌గేట్ వద్ద నిందితులు వదిలి వెళ్లిన లారీ

గుర్రంకొండ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులో మాయ మైన లారీ పీలేరు టోల్‌గేట్ వద్ద ప్రత్యక్షం కావడంతో లారీ యాజమానులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్ యార్డులో ఎన్నడూ లేని విధంగా లారీ చోరీకి గురవడం వ్యాపారులను విస్మయానికి గురిచేస్తోంది. వ్యాపారుల వివరాల మేరకు గుర్రంకొండ మార్కెట్ యార్డులో బాబాజాన్ టమోటా వ్యాపారాలను సాగిస్తున్నాడు. ఈ క్రమంలో టమోటాలను బయటి ప్రాంతాలకు తరలించడానికి సొంతంగా లారీలను ఏర్పాటు చేసుకున్నాడు. ఇటీవల మార్కెట్‌కు టమోటాలు తగ్గడంతో వ్యాపారాలు మందగించాయి. దీంతో రాత్రి పూట లారీలను మార్కెట్ యార్డులోనే ఉంచి ఇళ్లకు వెళతారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి మార్కెట్ యార్డులో ఉన్న 14 చక్రాల లారీని గుర్తుతెలియని నిందితుడు అపహరించి పీలేరు టోల్‌గేట్ వద్ద వదిలివెళ్లాడు. విషయం తెలుసుకున్న బాధితుడు లారీ చోరీకి గురైనట్లు గుర్తించి సీసీ కెమెరాలను పరిశీలించి పీలేరు టోల్ గేట్ వద్ద నిందితుడు వదిలివెళ్లినట్లు తెలుసుకుని లారీని గుర్రంకొండకు తీసుకొచ్చారు. లారీ చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వ్యాపారీ తెలిపాడు. పోలీసులు విచారించి నిందితుడిని పట్టుకుంటామని ఏఎస్‌ఐ గజేంద్ర తెలిపారు.

విషద్రావణం సేవించి యువరైతు ఆత్మహత్య

- చెట్లవారిపల్లెలో విషాదం


వంశీకృష్ణారెడ్డి (ఫైల్)

ములకలచెరువు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి యువ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... చౌడసముద్రం పంచాయతీ చెట్లవారిపల్లెకు చెందిన వెంకటస్వామిరెడ్డి కుమారుడు వంశీకృష్ణారెడ్డి(30) వ్యవసాయంలో తండ్రికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. తండ్రి అప్పులు చేయడంతో పాటు బీటెక్ చదువుకున్న తనకు ఉద్యోగం రాలేదని మనస్థాపం చెందాడు. ఈ క్రమంలో ఈ నెల 10న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబీకులు హుటాహుటిన చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్సలు చేయిస్తున్నారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు. యువరైతు మృతితో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య


సుబ్రహ్మణ్యం

వాల్మీకిపురం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రామసముద్రం మండలం చొక్కొండ్లపల్లె పంచాయతీ కనగాని గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం(45) తన భార్య కాపురానికి రాలేదని మనస్థాపం చెంది సోమవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లెలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధించాలి

- ఆదర్శ పాఠశాలల ఏఏఎంవో పీవీఎస్ కుమార్


విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఏఎంవో పీవీఎస్ కుమార్

ములకలచెరువు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని ఆదర్శ పాఠశాలల అసిస్టెంట్ అకడమిక్ మానటరింగ్ ఆఫీసర్ పీవీఎస్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఆదర్శ పాఠశాల, కళాశాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే కష్టపడి పనిచేయాలన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుకోవాలన్నారు. కష్టపడి కాకుండా ఇష్టపడి పని చేయాలన్నారు. అనంతరం టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఇన్‌టైమ్, అవుట్ టైమ్ హాజరు, విద్యార్థుల హాజరు, తరగతి గదులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై విద్యాశక్తి క్లాసుల పనితీరు, ఎంసెట్, జెఈఈ, నీట్ తరగతుల నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆదర్శ పాఠశాల వసతి గృహాన్ని కూడా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కవిత పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవం


శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని గ్రామోత్సవం

పెనగలూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వడ్డిపాలెం వేంకటేశ్వరాలయం వార్షికోత్సవం సందర్భంగా మంగళ వారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి తురక వెంకటరమణ, వెంకట సుబ్బమ్మ దంపతుల ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. అంతకంటే ముందు కుంచాల నరసింహులు, లక్షుమ్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీవారి మూలవిరాట్‌లకు పంచామృతాభిషేకం, సుగుంధ ద్రవ్యాలు, సువాసన పూలతో ఘనంగా అభిషేక కార్యక్రమం జరిగింది. తురక వెంకటయ్య, రమణమ్మ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. కుంచాల చిన్న వెంకటసుబ్బయ్య, యానాదమ్మల దంపతుల సహకారంతో గ్రామసభలో నెల్లూరు కళాకారులచే అద్భుతమైన కోలాట ప్రదర్శన జరిగింది. గ్రామసభలో భక్తులకు తురక కుమార్, వెంకటలక్షుమ్మ కుటుంబ సభ్యులు బూంది ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వహణ కార్యకర్తలు కుంచాల వేణు, బత్తల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు వరం..పీఎంఈజీపీ

- 343 యూనిట్లకు... 253 యూనిట్లు పూర్తి
- డెయిరీ ఫాం, పవర్‌లూమ్స్, వర్క్‌షాప్‌లకు అధిక ప్రాధాన్యత
- జిల్లాలో డెయిరీ ఫామ్‌పై 60-70 శాతం యువత మొగ్గు



జిల్లా పరిశ్రమలశాఖ కార్యాలయం

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ) ప్రవేశ పెట్టింది. ప్రస్తుతం ఈ పథకం నిరుద్యోగులకు వరంలా మారింది. రాయల సీమలో అన్నమయ్య జిల్లా కరువు ప్రాంతానికి పెట్టింది పేరు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే తప్ప నిరుద్యోగ యువత వలసలకు అడ్డుకట్ట వేయలేమనే వాదన ఒకప్పుడు బలంగా ఉండేది. అయితే ఇక్కడ చదువుకుని ఉద్యోగాలు లేక నిరుద్యోగులు కువైత్, సౌదీ ప్రాంతాలకు వెళ్లి నానా ఇబ్బందులు పడుతూ.. ఇక్కడ కుటుంబాలను పోషిస్తున్న పరిస్థితి గత 30 ఏళ్లుగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో మదనపల్లె డివిజన్‌లోని యువత ఎక్కువగా పాడి పరిశ్రమ, పవర్‌లూమ్స్, వర్క్‌షాప్‌పై మొగ్గుచూపుతున్నారని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లా పరిశ్రమల శాఖ ద్వారా 343 యూనిట్లకు గానూ 252 యూనిట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం దాదాపు రూ.884 లక్షలు బ్యాంకుల ద్వారా నిరుద్యోగ యువతీ, యువకులకు అందించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. రాజంపేట, రాయచోటి డివిజన్‌లో టైలరింగ్, జిరాక్స్, బ్యూటీపార్లర్, వర్క్‌షాపుల పైన యువతీ యువకులు ఎక్కువ మొగ్గుచూపుతున్నారని తెలుస్తుంది.

ఈ నేపథ్యంలో పీఎంఈజీపీ ద్వారా నిరుద్యోగ యువతకు 2025-26 ఏడాదికి మొత్తం 135 యూనిట్లకు గాను రూ.324 లక్షలు ఇవ్వడానికి అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈ ప్రాంతంలో చదువుకున్న యువతీ యువకులు సాఫ్ట్‌వేర్ వైపు మొగ్గు చూపి కొంత మంది ముంబై, చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో కొంతకాలం పనిచేసి తిరిగి వారి ప్రాంతాలకు వచ్చి వ్యవసాయం, పాడిపరిశ్రమ పైన ఎక్కువ శ్రద్ధ పెడుతున్నారని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో మదన పల్లె డివిజన్‌లో యువ సాఫ్ట్‌వేర్ తన ఉద్యోగం వదిలేసి పాడి పరిశ్రమలు ఏర్పాటు చేసి దాదాపు నెలకు రెండు లక్షలు సంపాదిస్తున్నాడని జిల్లా పరిశ్రమలశాఖ అధికారులు చెబుతున్నారు. అలాగే రామాపురంలో ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తన ఉద్యోగం వదిలేసి డ్రాగన్ ఫ్రూట్స్ వేసి రూ.20 లక్షలు సంపాదించాడని ఏడాది క్రితం పత్రికల్లో ఒక కథనం వచ్చింది. ఇలా నిరుద్యోగ యువతీ, యువకులను ఆదుకుంటూ వారికి చేదోడు వాదోడుగా జిల్లా పరిశ్రమలశాఖ ఉందని కొంత మంది నిరుద్యోగులే చెప్పుకొస్తున్నారు.

జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ఏమన్నారంటే..

ఈ విషయంపై జిల్లా పరిశ్రమలశాఖ అధికారి కృష్ణకిశోర్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. జిల్లాలో యువతీ యువకులు ఇతర దేశాలకు, ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని నిరుద్యోగులను ఆకర్షించే విధంగా కొన్ని కార్యక్రమాలు చేస్తున్నాం. అందులో భాగంగా మొదటగా పాలడెయిరీ ఫామ్‌లను యువత ఆకర్షిస్తున్నారు. తర్వాత పవర్‌లూమ్స్ కూడా లోన్స్‌తో పాటు చిన్న చిన్న కుటీర పరిశ్రమలకు సంబంధించిన లోన్స్ చేస్తున్నాం. కొందరు సాఫ్ట్‌వేర్ వైపు వెళ్లిన యువత తిరిగి వచ్చి వారి ప్రాంతంలో డైరీ ఫామ్ ఏర్పాటు చేసుకోవడం, వ్యవసాయం వైపు వెళ్లడం చేస్తున్నారు. వారికి తాము లోన్స్ ఇచ్చే ప్రయత్నాలు కూడా చేస్తున్నాం.

జైలు సిబ్బందిపై చర్యలు

- ఇన్‌చార్జ్ సూపరిండెంటెంట్ సహా మరో ఇద్దరికి చార్జ్ మెమోలు

ప్రొద్దుటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు సబ్ జైలు నుంచి ఆగస్టు 16న రిమాండ్ ఖైదీ మహ్మద్‌రఫీ పరారీలో జైలు సిబ్బంది నిర్లక్ష్యంపై జిల్లా సబ్ జైళ్ల అధికారి అమర్‌బాషా చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు ఇన్‌చార్జ్ జైలు సూపరింటెండెంట్‌గా ఉన్న శ్రీనివాసరావుతో పాటు మరో ఇద్దరి కానిస్టేబుళ్లకు చార్జ్ మెమోలు జారీ చేశారు. రిమాండ్ ఖైదీ జైలు గోడలు దూకి పరారవ్వడంలో జైలులో వున్న భద్రత ప్రమాణాలపై కూడా చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా జైలు గోడలు ఎత్తుతో పాటు గోడలు ఎక్కేందుకు ఎక్కడెక్కడ వీలుందో పరిశీలించారు. అలాగే జైలు గోడలపై వేసిన ఇనుప కంచెలో మనుషులు దూరెంత సందు ఉండటం, తీగలకు విద్యుత్ ఉన్నా పరారవ్వడంపై లోతుగా ఆరాతీస్తున్నారు.

రిమాండ్‌కు తరలింపు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): చిప్పిలి వద్ద దాడి చేసి ఇద్దరిని గాయపర్చిన కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు ఇటీవల సోషియల్ మీడియాల్లో పోస్టు పెట్టారనే కారణంతో పెద్దమండ్యం అవేకే నాయక్ తాండా సర్పంచ్ నటరాజ నాయక్, సాగర్లపై దాడి చేసి గాయపర్చారు. ఈ కేసులో శివశంకర్, కార్తీక్‌రెడ్డి, హరీష్, శ్రీకాంత్‌రెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

నూతన బార్ పాలసీపై అవగాహన అవసరం

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్


సమావేశంలో మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజ్

రాయచోటిటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నూతన బార్ పాలసీపై అవగాహన అవసరమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజ్ తెలిపారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన బార్ పాలసీలోని సానుకూలతలను వివరించారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని మదనపల్లెలో-5, రాజంపేటలో-2, రాయచోటిలో-3, పీలేరులో-1 చొప్పున బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైందన్నారు. బార్ అండ్ రెస్టారెంట్ల ఏర్పాటు కోసం ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు గడువు ముగిసిన అనంతరం ఈ నెల 28వ తేదీన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా బార్లు కేటాయిస్తారన్నారు. గతం కంటే ప్రస్తుతం లైసెన్స్ ఫీజు తగ్గడమే కాకుండా, బార్లు ఏర్పాటు చేసుకునే వారికి ప్రభుత్వం పలు సానుకూలతలు కల్పించిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి మధుసూదన్, అసిస్టెంట్ అధికారి జోగేంద్ర, జిల్లాలోని ఎక్సైజ్ సీఐలు, లైసెన్స్‌దారులు, మద్యం షాపుల లైసెన్సీలు పాల్గొన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించుకుందాం

- ఏపీజీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ డీ.లక్ష్మిప్రసాద్


సమస్యలపై చర్చిస్తున్న డాక్టర్ లక్ష్మిప్రసాద్

రాయచోటిటౌన్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే 'టీ తాగుతూ చర్చించుకుందాం' అనే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మిప్రసాద్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యక్రమానికి హాజరైన వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సత్యనారాయణ నూతనంగా టీ తాగుతూ చర్చించుకుందాం అనే కార్యక్రమాన్ని ప్రారంభించార న్నారు. రాష్ట్రంలోని ఉద్యోగస్తులకు పీఆర్‌సీ అరియర్, డీఏ అరియర్, అలాగే 3 సంవత్సరాల సరెండర్ లీవ్స్ అరియర్స్ పెండింగ్ ఉన్నాయన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేకతతో తాము ఎలాంటి కార్యక్రమాలు చేపట్టలేదని ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతోనే సానుకూలంగా రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమం ద్వారా ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలాజీ, రాయచోటి తాలూకా అధ్యక్షుడు సాయికుమార్, కార్యదర్శి సుజిత్‌డాల్, పెన్షనర్ సంఘం అధ్యక్షుడు రాజా, సభ్యులు తిరుపతి శ్రీనివాసులు, అధ్యాపకులు మడితాటి నరసింహారెడ్డి, గిరిబాబుయాదవ్, మోహన్ నాయక్, శివభాస్కర్, రెడ్డెప్పరెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

పగలు బొగ్గులు.. రాత్రి దోపిడీలు

- పాణ్యం ముఠాకు రాయచోటి వ్యక్తి సాయం
- చెక్కవారిపల్లి నుంచి నెలకు సరిపడా సరుకులు

తనకల్లు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలంలోని చెక్కవారిపల్లి అటవీ ప్రాంతంలో సోమవారం పట్టుబడిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా వ్యవహారం కలకలం రేపుతోంది. అటవీ ప్రాంతంలో ఈ ముఠా ఆరు నెలలుగా గుడారాలు వేసుకుని ఉంటోంది. తనకల్లు, కదిరి రూరల్, పాణ్యం పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేసి వీరిని పట్టుకున్నారు. వారి కదలికలను గుర్తించేందుకు డ్రోన్‌ల నిఘా పెట్టారు. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన శేఖర్ అనే వ్యక్తి ద్వారా వీరు తనకల్లు మండలంలోని దిగువ చెక్కవారిపల్లికి చేరినట్లు సమాచారం. అక్కడి నుంచి నెల క్రితం అటవీప్రాంతానికి మకాం మర్చారు. వీరందరూ నంబులపూలకుంట మండలం పెడబల్లి వద్ద బొగ్గులు కాల్చే పనికి వెళ్లేవారు. వీరికి చెక్కవారిపల్లికి చెందిన ఓ వ్యక్తి ద్వారా ప్రతి నెలా తినడానికి కావలసిన సరుకులు వెళ్లేవని సమాచారం. రాయచోటికి చెందిన శేఖర్‌కు చెక్కవారిపల్లికి చెందిన ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. అతని ద్వారానే శేఖర్ దొంగల ముఠాకు సాయం అందించాడని సమాచారం. పగటిపూట బొగ్గులు కాల్చి, రాత్రిళ్లు దోపిడీలకు పాల్పడేవారని సమాచారం.

ఆకేపాటి రిసెప్షన్‌కు వైసీపీ అధినేత


ఆకేపాడులో నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

రాజంపేట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి కుమారుడు రిసెప్షన్‌కు వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం హాజరయ్యారు. బెంగుళూరు నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఆకేపాడుకు వచ్చి ఆకేపాటి అనురాగరెడ్డి, వరదీక్షితరెడ్డి దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ వద్ద ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, కడప కార్పొరేషన్ చైర్మన్ సురేష్ బాబు, జడ్పీ మాజీచైర్మన్ సుగవాసి బాలసుబ్రమణ్యం, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, అన్నమాచార్య యూనివర్శిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి, వైసీపీ రాజంపేట ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి స్వాగతం పలికారు.

రీసర్వే పారదర్శకంగా నిర్వహించండి

- సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి


రీసర్వే పనుల గురించి ఆరా తీస్తున్న సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి

మదనపల్లెటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి తెలిపారు. మంగళవారం మదనపల్లె మండలం పోతబోలు గ్రామంలో రీసర్వేను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సర్వే నెంబర్‌లోని భూములు, రికార్డులకు అనుగుణంగా సర్వే చేయాలన్నారు. సర్వే సమయంలో సంబంధిత రైతులకు సమాచారం ఇచ్చి వారి సమక్షంలో సర్వే చేస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదన్నారు. రీసర్వేలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటే రైతులు మళ్లీ మళ్లీ రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో డీఐ వెంకటరమణ నాయుడు, సర్వేయర్ సుబ్రహ్మణ్యం, రీసర్వే డీటీ మౌలా, వీఆర్‌వో నారాయణ, పోతబోలు మాజీ సర్పంచ్ పఠాన్ ఖాదర్‌ఖాన్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రతి రోజూ చెత్త సేకరించాలి

- జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి

ఒంటిమిట్ట, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతిరోజు చెత్త సేకరించాలని జిల్లా పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మి ఆదేశించారు. మంగళవారం మండలంలోని పెన్నపేరూరు, గంగపేరూరు గ్రామాల్లో సౌమిత్వ ఐవీఆర్ఎస్ అమలు పరిస్థితిపై పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలని అందుకు అవసరమైన కూలీలు వాహనాలు, డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటే అక్కడి ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. సౌమిత్వ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిని కొలిచి, దాని ఆధారంగా ప్రాపర్టీ కార్డును మంజూరు చేయాలన్నారు. గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రజలు కూడా బాధ్యత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రసాద్, గంగపేరూరు పంచాయతీ కార్యదర్శి సౌజన్య, సాలాబాదు పంచాయతి కార్యద్శి చంద్ర తదితరులు పాల్గన్నారు.


సౌమిత్వ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న డీపీవో

ఏజీ గార్డెన్ కాలనీ ఎవరిది...?

- గ్రామ పంచాయతీదా.. మున్సిపాలిటీదా...
- సిమెంటు రోడ్డు, తాగునీరు లేక ఇక్కట్లు



తమ గోడును వెళ్లబోసుకుంటున్న కాలనీవాసులు, (ఇన్‌సెట్లో) ట్యాంకర్ ద్వారా నీటిని కొనుగోలు చేసుకుంటున్న దృశ్యం

రాయచోటిటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న ఏజీ గార్డెన్ కాలనీలో 100 కుటుంబాలకు పైగా అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్నారు. 2009-10 ప్రాంతంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ పథకం కింద ఆ కాలనీలో ఇండ్లు లేని పేదలకు ఇంటి పట్టాలిచ్చి గృహాలు నిర్మించారు. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో పాటు లబ్ధిదారులు సొంతంగా కొంత ఖర్చు చేసుకొని ఇళ్లను నిర్మించుకున్నారు. సుమారు 150కి పైగా వివిధ వర్గాలకు చెందిన పేదలు రాయచోటి పట్టణంలో ఇంటి బాడుగలు కట్టలేక ప్రభుత్వం ఇచ్చిన స్థలాల్లో కొంత మంది ఇండ్ల నిర్మాణం చేపట్టి నివాసముంటుండగా, మరి కొంత మంది ఆర్థిక స్థోమత లేక అలాగే వదిలేశారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం గృహ నిర్మాణశాఖ ద్వారా ఇండ్ల నిర్మాణానికి బిల్లులు చెల్లించడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించి వదిలేశారు. అప్పటి నుంచి కనీస మౌలిక వసతులు లేక ఏజీ గార్డెన్ కాలనీ వాసులు దినదినగండంగా కాలం వెల్లబుచ్చుతున్నారు. ప్రస్తుతం వారి నివసిస్తున్న ఏజీ గార్డెన్ కాలనీకి పక్కనే గల మరో ఇందిరమ్మ కాలనీకి వెలిగల్లు నీటి పథకం నుంచి తాగు నీటి పైపులైను ఏర్పాటు చేసి నీటిని అందిస్తున్న మున్సిపల్ అధికారులు కాలనీకి మాత్రం నీరు ఇవ్వకపోవడం ఆశ్చర్యం. ప్రతి కుటుంబం వారానికి ఒక నీటి ట్యాంకును కొనుగోలు చేయక తప్పడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే ఒకరి మీద ఒకరు పెట్టుకుని కాలయాపన చేయడం పరిపాటిగా మారింది.

ఈ కాలనీ ఎవరి పరిధిలోకి ?

రాయచోటి పట్టణ పరిధిలోని మదనపల్లె రోడ్డులో గల ఏజీ గార్డెన్ ఇందిరమ్మ కాలనీ ఎవరి పరిధిలోకి వస్తుందో ఇప్పటికీ క్లారిటీ లేదు. సుమారు 15 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ఇందిరమ్మ పథకం కింద గృహ నిర్మాణశాఖ వారు రాయచోటి పట్టణంలో అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్న పలువురు పేదలకు ఏజీ గార్డెన్ కాలనీలో ఇంటి పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు.

తాగునీరు అసలే లేదు

సుమారు 100 కుటుంబాలకు పైగా నివసిస్తున్న ఈ కాలనీలో నేటికీ అక్కడ సిమెంటు రోడ్లు లేకపోవడం, తాగునీరు అసలే లేకపోవడం చూస్తే వారు పట్టణంలో ఉన్నారా లేక మారుమూల అటవీ ప్రాంతంలో ఉన్నారా అనే సందేహం కలుగకమానదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని రోడ్ల సమస్య, తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

8 మంది సీఐల బదిలీ

కడప క్రైం ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో పని చేస్తున్న 8మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కడప వీఆర్‌లో ఉన్న జి.సుబ్బారావును కడప టూటౌన్ పీఎస్‌కు, ఎన్.క్రిష్ణయ్యను బద్వేల్ రూరల్ సర్కిల్‌కు బదిలీ చేశారు. బద్వేలు సర్కిల్ నుంచి ఎం.నాగభూషణ్‌ను సీకే దిన్నెకు, ఇక్కడున్న ఎస్‌డీ శివశంకర్ నాయక్ కడప ఎస్బీ-2కు బదిలీ అయ్యారు. ఎస్బీ-2 నుంచి డి.భాస్కర్ రెడ్డి ఎస్బీ-1కు ఇక్కడున్న ఆర్.పురుషోత్తం రాజు కడప ఎస్సీ/ఎస్టీసెల్‌కు, ఇక్కడున్న వి.వేణుగోపాల్ ప్రొద్దుటూరు త్రీటౌన్‌కు, ఇక్కడి నుంచి ఏ.గోవిందరెడ్డి కడప వీఆర్‌కు బదిలీ అయ్యారు.

అంగన్వాడీ కేంద్రంలో సిబ్బంది మధ్య గొడవ

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కడప నగర పరిధిలోని మాసాపేట సెక్టారులో ఉన్న సున్నపురాళ్ల మిట్ట 1 అంగన్వాడీ కేంద్రంలో సిబ్బంది గొడవ పడినట్లు తెలుస్తోంది. ఐదురోజుల క్రితం అంగన్వాడీ టీచరు, ఆయా గొడవ పడినట్లు సమాచారం. ఇరువురు పోలీసు స్టేషన్‌కు కూడా వెళ్లినట్లు తెలుస్తుంది. కాగా, ఈవిషయంపై సీడీపీవో విచారణ చేపట్టి ప్రాజెక్టు డైరెక్టరుకు నివేదించారు. ఈ మేరకు మంగళవారం పీడీ కేంద్రానికి వచ్చి ఇరువురితో సంఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ పీడీ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ సిబ్బంది గొడవపడ్డారనే విషయంపై విచారణ చేపట్టామన్నారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నట్లు చెబుతున్నారని... ఇందుకు సంబంధించి ఎటువంటి సాక్ష్యాధారాలు లేవని వివరించారు. ప్రస్తుతం అక్కడ ఉన్న కేంద్రాన్ని మరో చోటకు తరలించినటట్లు ఆమె తెలిపారు.

పిచ్చికుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

కమలాపురం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కమలాపురం నగర పంచాయతీ పరిధిలోని మీరాపురంలో మంగళవారం ఉదయం పిచ్చికుక్క స్వైరవిహారం చేసింది. గ్రామంలో కనిపించిన వారిపై దాడి చేసింది. ఈ దాడిలో గ్రామానికి చెందిన సుబ్బమ్మ, అరుణ, సుబ్బరాయుడుకు గాయాలయ్యాయి. వీరిని కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు.

పంట నష్టం చేశారని కేసు నమోదు

కలసపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నపల్లెలో పంట నష్టం చేశారని ఎక్కలూరు శ్రీనివాసులుపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. గ్రామానికి చెందిన అంకయ్య మరికొందరు సాగు చేసిన సజ్జ పంటను శ్రీనివాసులు ట్రాక్టర్‌తో తొక్కించుకొని వెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రైతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపుతప్పి కారు బోల్తా

● ఇద్దరికి స్వల్ప గాయాలు

కొండాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంజిఅనంతపురం గ్రామం వద్ద చిత్రావతి బ్రిడ్జి సమీపంలో మంగళవారం కారు అదుపుతప్పి బోల్తా పడింది. స్థానికుల సమాచారం మేరకు కారు ప్రొద్దుటూరు నుంచి కళ్యాణదుర్గం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. కారులో నలుగురు ప్రయాణిస్తుండగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

బీ.. కేర్‌ఫుల్

మేల్కోకపోతే ముప్పు తప్పదు

ప్రమాద ఘంటికలు మోగిస్తున్న వంతెనలు

ఆందోళనలో ప్రజలు


పిల్లర్లు దెబ్బతిని అధ్వాన్నస్థితిలో ఉన్న సగిలేరు వంతెన

సగిలేరు వంతెనపై...

కలసపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ కాలంలో కలసపాడు వద్ద సగిలేరుపై నిర్మించిన బ్రిడ్జి ప్రస్తుతం ప్రమాదఘంటికలు మోగిస్తోంది. ఈ వంతెన అధ్వాన్నస్థితికి చేరుకున్న పట్టించుకునేవారే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు. ఈ వంతెనకు సంబంధించిన పిల్లర్లు అప్పట్లో రాళ్లతో నిర్మిచారు. స్లాబ్ మాత్రం కాంక్రీట్‌తో ఏర్పాటు చేశారు. పోరుమామిళ్ల-గిద్దలూరు ప్రధాన రహదారిలోని కలసపాడు వద్ద సగిలేరుపై నిర్మించిన ఈ వంతెనపై నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ప్రైవేట్, ఆర్టీసీ బస్సులతో పాటు భారీ బరువుతో కూడిన ఇనుము, ఇసుక, కంకర, ధాన్యం బస్తాలతో లారీలు ఈ వంతెనపై వెళ్తుంటాయి. 1996లో వచ్చిన వరదకు వంతనపై పది అడుగుల మేర నీరు ప్రవహించింది. వరద ధాటికి కొన్ని పిల్లర్లు దెబ్బతినడంతో సంబంధిత అధికారులు తాత్కాలికంగా మరమ్మత్తులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. 2020లో కూడా వంతెన పైనుంచి నీరు ప్రవహించింది. ప్రస్తుతం వంతెనపై గుంతలు ఏర్పడటంతో వర్షం వచ్చినపుడు వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాతితో నిర్మించిన పిల్లర్లకు నెర్రెలు ఏర్పడడంతో వాహనదారులు, ప్రయాణీకులు, ప్రజలు ఆందోళనలకు గురవుతున్నారు. చిన్నచిన్న రహదారిపై కోట్ల రూపాయలతో వంతెనలు నిర్మిస్తున్న రహదారులు, భవనాలశాఖ అధికారులు ఎంతో ప్రాముఖ్యత ఉన్న ఈ ప్రధాన రహదారిపై నూతన వంతెన నిర్మాణంపై శ్రద్ధ చూపకపోవడం పట్ల ఈ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కుందూ బ్రిడ్జిపై...

చాపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామపురం గ్రామం వద్ద కుందూ నదిపై నిర్మించిన బ్రిడ్జిపై ప్రమాదం పొంచి ఉంది. ఈ వంతెనను 1927లో బ్రిటీష్‌వారు నిర్మించారు. బ్రిడ్జిపై ప్రతి రోజు వందల సంఖ్యలో వాహనాలు తిరుగు తుంటాయి. అల్లాడుపల్లె, పెద్దగురువలూరు, సీతారామపురం, చిన్నగురవలూరు, మరో ఎనిమిది గ్రామాల ప్రజలు ఈ బ్రిడ్జి గుండా ప్రొద్దుటూరు, మైదుకూరు పట్టణాలకు వెళుతుంటారు. పొలాల్లో పండించిన పంట ఉత్పత్తులను కూడా రైతులు ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో ఇళ్లకు తీసుకుపోతుంటారు. అల్లాడుపల్లె వీరభద్రస్వామిని దర్శించుకునేందుకు కూడా ప్రొద్దుటూరు నుంచి భక్తులు వస్తుంటారు. కాగా, గత రెండు వారాల నుంచి నదిలో సుమారు 20 అడుగుల లోతు నీళ్ల ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో బ్రిడ్జిపై నీళ్లు పొర్లి ప్రవహించే అవకాశం ఉంది. ఇప్పటికే వంతెన పిల్లర్లలో ఒకటి దెబ్బతినగా.. అధికారులు తాత్కాలిక మరమ్మత్తులు చేసి చేతులు దులుపుకున్నారు. ఇక వంతనపై రక్షణగా ఏర్పాటు చేసిన సిమెంటు దిమ్మెలు దెబ్బతిన్నాయి. దీంతో బ్రిడ్జిపై రాకపోకలు సాగించే సమయంలో ఎప్పుడు ఏం ప్రమాదం సంభవిస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి హైలెవల్ వంతెన నిర్మించాలని కోరుతున్నారు.


సీతారామపురం గ్రామం వద్ద ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

సుస్థిర జీవనోపాధులపై ప్రణాళికలు రూపొందించాలి : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామా ల్లో సుస్థిర జీవనోపాధి, ఆర్థిక అభివృద్ధి సాధనకు స్వయం సహాయక సంఘాలను, రైతు ఉత్పత్తి సంస్థలను బలోపేతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాల్లో గ్రామీణాభివృద్ధి, బ్యాంకింగ్, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అన్ని విధాల అభివృద్ధి పథంలో నడవాలంటే అన్ని ప్రాధాన్యత రంగ శాఖలు సమన్వయంతో కేటాయించిన లక్ష్యాలను అధిగ మించాలన్నారు. ముందుగా అన్ని గ్రామాల్లో సామాజిక ఆర్థిక స్థితిగతులు, అక్కడ అందుబా టులో ఉన్న వనరులను సద్వినియోగం చేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లాలో గ్రామీ ణాభివృద్ధి సంస్థ రెండేళ్లుగా పేదరిక నిర్మూలన కోసం పాటు పడుతోందన్నారు. 26,965 స్వయం సహాయక సంఘాల ద్వారా 2.62 లక్షల మంది మహిళలు ఆర్థికంగా లబ్ధి పొందుతున్నార న్నారు. అధిక శాతం వ్యవ సాయ రంగ అనుబంధ రంగాల్లో ఉపాధి పొందుతున్నారని తెలిపారు. కార్యక్ర మంలో డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి గ్రామాల్లో సుస్థిర జీవనోపాధి కల్పనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో బ్యాంకు అధికారులు, వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

అదృశ్యమైన నాగేశ్వరరావు ఆచూకీ నిగ్గుతేల్చాలి

● నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారావు


మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారావు

కడప మారుతీనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లకు చెందిన గుర్రం శ్రీనివాసరావు అనే వ్యక్తితో కలిసి దాదాపు 17 ఎకరాలలో జామ పంటను సాగు చేసి తీరా పంట చేతికి వచ్చే సమయంలో కనిపించ కుండా పోయిన బాపట్ల జిల్లా బట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామ నాయీబ్రాహ్మణ కులానికి చెందిన మోపిదేవి నాగేశ్వరరావు ఆచూకీని ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం నిగ్గుతేల్చాలని నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు నరసింహారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరుమామిళ్లలోని పులివీడు గ్రామానికిచెందిన ఖాజాపీర్ దగ్గర నుండి 17 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని గుర్రం శ్రీనివాసరావుతో కలిసి నాగేశ్వరరావు పంట సాగు చేశారన్నారు. మూడేళ్లుగా పంట సాగుచేసి తీరా పంట చేతికివచ్చే సమయంలో గత ఏప్రిల్ 7వ తేదీ నుంచి నాగేశ్వరరావు కనిపించకుండా పోయారన్నారు. ఈ విషయంపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. తదనంతరం నాగేశ్వరరావు భార్య నవ్యశ్రీ మాట్లాడుతూ తన భర్త కనిపించకుండా పోవడానికి ప్రధాన కారకుడు గుర్రం శ్రీనివాసరావు అని ఆరోపించారు. జామ పంట సాగుకు దాదాపు రూ.13 లక్షలు ఖర్చు చేయగా కౌలు నిమిత్తం ఖాజాపీర్‌కు రూ.7 లక్షలు చెల్లించినట్లు వెల్లడించారు. డబ్బులతో పాటు భర్త కనిపించకపోవడంతో ఇద్దరు పిల్లలతో రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు త్వరితగతిన స్పందించి నా భర్త ఆచూకీ తెలపాలని కోరారు.

హెడ్‌కానిస్టేబుల్ కుటుంబానికి రూ.2.5 లక్షల ఆర్థిక సాయం


హెడ్‌కానిస్టేబుల్ భార్య జయలక్ష్మికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేట పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన హెడ్‌కానిస్టేబుల్ ఎం.నాగార్జునరెడ్డి (హెచ్‌సీ 1071) కుటుం బానికి ఎస్పీ అశోక్‌కుమార్ రూ.2.5 లక్షల ఆర్థికసాయం అందించారు. పోలీసు సంక్షేమంలో భాగంగా పోలీసు వితరణ నిధి నుంచి ఈ మొత్తాన్ని మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హెడ్‌కానిస్టేబుల్ సతీమణి ఎం.జయలక్ష్మికి అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ హెడ్ కానిస్టేబుల్ కుటుంబ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసుశాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(పరిపాలన) కె.ప్రకాశ్ బాబు, ఏవో కె.వెంకటరమణ, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేశ్ పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు కేటాయించాలి

● జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం విడుదల చేసే నిధులు కీలకంగా మారుతాయని త్వరలో వాటిని విడుదల చేయాలని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం అమరావతిలోని ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ కార్యాలయ ప్రత్యేక ఓఎస్‌డీ కె.వెంకటకృష్ణను కలిసి ఆయన ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన సర్‌చార్జిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కడపజిల్లాలో కూడ నుంచి గత 22 నెలలుగా కొత్తపల్లె పంచాయతీకి, జిల్లాలోని ఇతర పంచాయతీలకు రావాల్సిన నిధులను విడుదల చేయాలని పేర్కొన్నారు. అలాగే 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. దీంతో ఓఎస్‌డీ సానుకూలంగా స్పందిస్తూ ఉపముఖ్యమంత్రితో చర్చించి వీలైనంత త్వరగా పంచాయతీలకు నిధులను విడుదలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారని శివచంద్రారెడ్డి తెలిపారు.

వైవీయూ క్యాంపస్ కళాశాలలో డిగ్రీకోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాలలో పలు కోర్సులలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు బుధవారం నుంచి ప్రారంభం కానున్నట్లు విశ్వవిద్యాలయ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ టి.లక్ష్మిప్రసాద్ వెల్లడించారు. నాలుగేళ్ల హానర్స్ కోర్సులైన బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ కోర్సులు, ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సులైన బయో టెక్నాలజీ అండ్ బయో ఇన్‌ఫర్మేటిక్స్, అప్లైడ్ జియాలజీ కోర్సులలో అడ్మిషన్లు ఉంటాయ న్నారు. ఈ కోర్సులలో చేరడానికి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత చాలన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్ అడ్మిషన్ మాడ్యుల్ ఫర్ డిగ్రీ కాలేజెస్ (ఓఎఎండీసీ) సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. పరిశోధన, అకడమిక్‌లో అపారమైన అనుభవం గల అధ్యాపకులచే ప్రయోగ, పరిశీలనాత్మక విద్యాబోధన ఆధునిక విధానంలో ఉంటుందన్నారు. నూతన జాతీయ విద్యా విధానం అనుసరించి విద్యాబోధన, సెమినార్లు, సింపోజిఎంలు, వర్క్‌షాపుల ద్వారా విస్తృత జ్ఞానం పొందే అవకాశం ఉంటుందన్నారు. క్యాంపస్ డ్రైవ్ ద్వారా ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. 50వేల పుస్తకాలతో గ్రంథాలయం విద్యార్థులకు అందుబాటులో ఉందన్నారు. బాల బాలికలకు వేర్వేరుగా వసతిగృహాలు ఉన్నాయని తెలిపారు.

ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో పరీక్ష ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ప్లానింగ్, ఫైన్ ఆర్ట్స్ విభాగాలకు సంబంధించి 2,4,6వ సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలను వర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.విశ్వనాథకుమార్ మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమంలో వర్సిటీ అదనపు పరీక్షల నియం త్రణాధికారి డాక్టర్ జి.ఫణీంద్రరెడ్డి, సహాయ పరీక్షల నియంత్రణాధికారి ఉదయ ప్రకాష్‌రెడ్డి, నారపరెడ్డి పాల్గొన్నారు.

ఆశల.. ఖరీఫ్

● పుంజుకుంటున్న పంటల సాగు
● ఊపిరి పోసిన వరుణుడు
● వారం రోజులుగా వర్షాలు
● 15,748 హెక్టార్లలో పంటలు
● 20.33 శాతానికి చేరిన సాగు


దేవుని కడప చెరువు కింద వరినాట్లు వేస్తున్న కూలీలు

కడప రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ఆశలు చిగురిస్తున్నాయి. నిన్నటివరకు మందకొడిగా సాగిన ఖరీఫ్ ఇప్పుడు నెమ్మదిగా పుంజుకుంటోంది. గత వారం రోజుల నుంచి జిల్లాలో ఆశాజనకంగా వర్షాలు పడుతున్నాయి. దీంతో ఖరీఫ్ సాగులో కదలిక వచ్చింది. జూన్ మొదటి వారంలో సీజన్ ప్రారంభమైంది. అంతకు మునుపు మే నెల చివరిలో పదును వర్షాలు పడ్డాయి. ఈ వర్షాలకు కొందరు రైతులు ఖరీఫ్‌లో భాగంగా అక్కడక్కడ వేరుశనగ, పత్తి, కంది, మినుము తదితర పంటలను సాగుచేశారు. ఆ తరువాత ఆగస్టు నెల మొదటి వారం వరకు దాదాపు రెండు నెలలు పైబడి వర్షాభావం వెంటాడడంతో ఖరీఫ్ సాగు మందకొడిగా సాగింది. దీంతో 77,475 హెక్టార్ల సాగుకు గాను జూలై 3 నాటికి కేవలం 2565 హెక్టార్లు మాత్రమే (3.31 శాతమే) సాగైంది. ఈ నేపధ్యంలో గత వారం రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా ఆశాజనకంగా వర్షాలు పడుతుడటంతో ఖరీఫ్ పంటల సాగు గణనీయంగా పెరుగుతోంది. గురువారం నాటికి 15,748 హెక్టార్లలో (20.33 శాతం) పంటలు సాగుకు నోచుకున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తెరపి ఇవ్వగానే ఖరీఫ్ సాగు మరింత జోరందుకోనుంది. దీంతో సాగు లక్ష్యాన్ని సాధించేందుకు వ్యవసాయశాఖ అధికారులు వడివడిగా అడుగులు వేస్తున్నారు.

వర్షాలతో మెట్టపంటలకు ప్రాణం

తీవ్ర వర్షాభావ పరిస్థితులు, అడుగంటిన భూగర్భజలాలు, నిండని జలాశయాలు ఇలాంటి విపత్కర పరిస్థితుల నుంచి జిల్లా రైతాంగం క్రమంగా బయటపడుతోంది. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో మెట్టపంటలకు ప్రాణం పోసినట్లయింది. మరోవైపు పెన్నా, కేసీ కెనాల్‌కు ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం ఉండడంతో ఆయకట్టుకు నీటి విడుదల పెరిగింది. దీంతో వరినాట్లు జోరందుకున్నాయి. అలాగే జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతాంగంలో ఆశలు చిగురించేలా చేస్తున్నాయి. ఖరీఫ్ ప్రారంభం నుంచి ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో జిల్లా రైతాంగానికి ఎదురుచూపులు తప్పలేదు. వారం రోజులనుంచి కురుస్తున్న వర్షాలతో చేతికి రాకుం డా పోతాయని భావించిన మెట్టపంటలకు సైతం ప్రాణం పోసినట్లయింది. పత్తి, వేరుశనగ, కంది, మినుము, పెసర పంటలకు ఊపిరి వస్తోంది.

15,748 హెక్టార్లలో పంటలు

జిల్లాలోని సాగు విస్తీర్ణంలో అత్యధిక భూభాగం వర్షాధారంపై ఆధారపడింది. ఇందులో ఖరీఫ్ సీజన్ ప్రథమ ప్రాధాన్యతగా వస్తోంది. జిల్లాలో 2025 ఖరీఫ్‌కు గాను సాధారణ విస్తీర్ణం కింద 77,475 హెక్టార్లు సాగు లక్ష్యంగా అధికారులు నిర్ధారించారు. ఇప్పటి వరకు ఖరీఫ్ మధ్యస్థానికి వచ్చింది.

గురువారం నాటికి అన్ని రకాల పంటలను కలుపుకుని 15,748 హెక్టార్లలో సాగుకు నోచుకున్నా యి. వీటిలో ప్రధానమైన వరి పంట 30,804 హెక్టార్లకు గాను 6568 హెక్టార్లలో, మొక్కజొన్న 932 హెక్టార్లకు 1772 హెక్టార్లలో, కంది 5761 హెక్టార్లకు 285 హెక్టార్లలో, మినుము పంట 3806 హెక్టార్లకు 1502 హెక్టార్లలో, పత్తి పంట 24,036 హెక్టార్లకు 3524 హెక్టార్లలో, వేరుశనగ 5,976 హెక్టార్లకు 983.88 హెక్టార్లలో, సన్‌ఫ్లవర్ 1142 హెక్టార్లకు 225 హెక్టార్లలో, ఇతర పంటలు ఆయా హెక్టార్లలో వెరసి ఇప్పటి వరకు 20.33 శాతం మేర సాగుకు నోచుకున్నాయి.

రాహుకాల కాంతుల్లో విజయదుర్గాదేవి ఆలయం



కడప కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నగర బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయం మంగళవారం రాహుకాల దీపాల కాంతులతో మెరిసింది. జిల్లా నలుమూలల నుండే కాకుండా రాయలసీమ ప్రాంతం నుంచి పలువురు మహిళా భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4-30 వరకు నిర్వహించారు.

అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్



లక్ష్మీకాంత్‌రెడ్డి

సీకేదిన్నె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కడప అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో సహాయ ఆచార్యుడుగా పనిచేస్తున్న ఎస్.లక్ష్మీకాంత్‌రెడ్డికి డాక్టరేట్ లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలో వేల్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ అండ్ అడ్వాన్స్ స్టడీస్ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేయడం జరిగిందన్నారు. విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ ఎం.మీనా పర్యవేక్షణలో కో-ఆపరేటివ్ స్పెక్ట్రమ్ సెమ్‌సింగ్ కాడ్నిటివ్ రేడియో నెట్‌వర్క్స్ యూజింగ్ మిషన్ లర్నింగ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేయడం జరిగిందన్నారు. డాక్టరేట్ పొందిన లక్ష్మీకాంతరెడ్డిని అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, వైస్‌చైర్మన్ చొప్పా యల్లారెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వివిధ విభాగాల అధిపతులు, ఏవో రామసుబ్బారెడ్డి, తదితరులు అభినందించారు.

పులివెందులలో రెండు బార్లకు నోటిఫికేషన్

పులివెందుల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): నూతన బార్ల పాలసీలో భాగంగా పులివెందుల మున్సిపాలిటీలో రెండు బార్లకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. లైసెన్సు ఫీజు రూ.55లక్షలుగా నిర్ణయించడం జరిగిందని, అప్లికేషన్ ఫీజు కింద రూ.5లక్షలు (నాన్ రీఫండబుల్) ఫీజు నిర్ణయించారన్నారు. ప్రతి బార్‌కు కనీసం నాలుగు అప్లికేషన్‌లు రావాలని నిబంధన పెట్టడం జరిగింది. నాలుగు అప్లికేషన్ల పైన వచ్చిన బార్లకు లాటరీ పద్ధతిలో కేటాయించడం జరుగుతుందన్నారు. అప్లికేషన్లు స్వీకరించడానికి ఆఖరి తేది 26.08.2025 సాయంత్రం 5గంటల వరకు ఉంటుందన్నారు. 28.08.2025న కలెక్టరేట్‌లో లాటరీపద్ధతిలో బార్లను కేటాయించడం జరుగుతుందన్నారు. లైసెన్స్ ఫీజును చెల్లించడానికి ఆరు ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో చెల్లించవచ్చన్నారు. బార్ల కాలపరిమితి 2025-2028 వరకు ఉంటుందన్నారు.

పారదర్శకంగా ఎన్నికల కమిషన్ సేవలందించాలి

కడప మారుతీనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): భారత ఎన్నికల కమిషన్ పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని పలు పార్టీల నాయకులు కోరారు. ఆ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్తార్ అధ్యక్షతన మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్ లో నిర్వహించిన ఓటు చోరీపై చర్చావేదిక నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, హేతువాద సంఘం అధ్యక్షుడు ప్రసాద్, బుద్ధిజం నాయకులు కుమారస్వామి, డాక్టర్ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శాంతిహోమం

కడప కల్చరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల తొలిగడప దేవునికడపలో వెలసిన లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బాలాలయం సంప్రోక్షణ కార్యక్రమాలలో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటలకు యాగశాలలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో శాంతిహోమం, వాస్తుహోమం, తదుపరి సాయంత్రం 5-30 గంటలకు కళాకర్షణలో భాగంగా గర్భాలయంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి మూల మూర్తిశక్తిని కుంభంలోకి ఆవాహన చేసి యాగశాలలో ప్రతిష్ఠించి ఆరాధన చేశారు.

ఆర్థిక సాయం


చెన్నూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన సువార్తమ్మ మృతి చెందడంతో ఆమె కుటుంబానికి స్థానిక టీడీపీ నేత ఆవుల నాగమల్లారెడ్డి తన తల్లి ఆవుల సుబ్బమ్మ జ్ఞాపకార్థం దహన ఖర్చు నిమిత్తం రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. గతంలో కూడా గ్రామంలో పేదలు ఎవరైనా చనిపోతే ఆ కుటుం బానికి టీడీపీ నేత దహన ఖర్చులు నిమిత్తం రూ.5వేలు అందిస్తున్నారు. రాబోవు రోజుల్లో ఈ సాయం మరింత పెంచి ఇస్తామని టీడీపీ నేత తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

కమలాపురం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : విద్య, క్రీడల కాంబినేషన్‌కి విద్యార్థుల ప్రతి భకు నిదర్శనం అని పెద్ద చెప్పలిఉన్నత పాఠశాల పీడీ సునీల్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కమలాపురంమండల పరిధిలో ఉన్న పెద్దచెప్పలి ఎలిమెంటరీ స్కూలు, వివేకానంద ప్రైవేటు స్కూలు, అలాగే వేదాస్ పబ్లిక్ స్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రతిభ కనబరిచి కడప వైఎస్‌ఆర్ స్పోర్ట్స్ స్కూలులో ఎంపికయ్యారన్నారు.

గతుకులలకు అతుకులు ఎప్పుడు..?

గుంతలు బాబోయ్ గుంతలు ● వేంపల్లెలో వెళ్లాలంటే వాహనదారులకు నరకమే ● కొత్తరోడ్డు దేవుడెరుగు ... పాత రోడ్డును మరమ్మతు చేయండి



గుంతలతో ఉన్న వేంపల్లి పట్టణంలోని పులివెందులరోడ్డు

వేంపల్లె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గుంతలు బాబోయ్ గుంతలు...ఆరోడ్డులో వెళ్లాలంటే వాహనదారులకు నరకం కనిపిస్తోంది. ద్విచక్రవాహనదారులు పలుమార్లు ప్రమాదానికి గురయ్యారు. ఇది ఎక్కడో దూరంగా లేదు. వేంపల్లె పట్టణంలో ప్రధానమైన పులివెందుల-కడప ప్రధానరహదారి దుస్థితి. ఏడాదిన్నరగా వేంపల్లె వాసులతోపాటు ఆ రోడ్డున ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేంపల్లె పట్టణంలో కడప-పులివెందుల ప్రధాన రహదారి ఉంది.నిత్యం వందలాది ద్విచక్రవాహనాలు తిరుగుతుంటాయి. పులివెందులరోడ్డులోని కందుల కాంప్లెక్స్ సమీపం నుంచి నాలుగురోడ్ల కూడలి మీదుగా బస్టాండ్, హనుమాన్ జంక్షన్ వరకు ప్రధాన ఆర్అండ్‌బీరోడ్డు పూర్తిగా దెబ్బతిని ఉంది. రెండుమీటర్లకు ఒక గుంతతో పెద్దపెద్దగొయ్యిలు ఏర్పడ్డాయి. ఇటీవల వరుసగా వర్షాలు వస్తుండడంతో ఆ గోతులు మరింత పెద్దవయ్యాయి. సుమారు కిలోమీటర్ మేర ఉండే ఆ రోడ్డులో వెళ్లాలంటే ప్రజలకు నిత్యం నరకం కనిపిస్తోంది. ఎక్కడ కింద పడి ఏ ప్రమాదం జరుగుతుందోనని ద్విచక్రవాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ రోడ్డును మరమ్మతు చేయాలనే ఆలోచనే ఆర్‌అండ్‌బీ అధికారులు మరచిపోయారు. ఎన్ని మార్లు అధికారుల దృష్టికివెళ్లినా మాకేం సంబంధం అంటూ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తరోడ్డును దేవుడెరుగు ...: పాత రోడ్డును మరమ్మతు చేయండి: వేంపల్లె పట్టణంలోని ప్రధానమైన కడప-పులివెందుల రోడ్డు పరిస్థితి రెండిటికి చెడ్డ రేవడిలా తయారైంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్తరోడ్డు వేయాలని నిధులు మంజూరయ్యాయి. పులివెందుల రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కందుల కాంప్లెక్స్ వరకు ఒకవైపు మాత్రమే సిమెంటురోడ్డు వేశారు. మరోవైపు పూర్తిగా గుంతలను వదిలేశారు. ఆ దారిన వాహనాలే వెళ్లడం లేదు అది మరో సమస్యగా చెప్పవచ్చు. కానీ కందుల కాంప్లెక్స్ నుంచి నాలుగురోడ్ల మీదుగా హనుమాన్ జంక్షన్ వరకు ఎలాంటి రోడ్డు వేయలేదు. ఎన్నికల ముందు కాం ట్రాక్టర్ పనులు పూర్తిగా నిలిపి వేయగా అప్పటి నుంచి ఇప్పటి వరకు యథాతథంగా కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వం రోడ్డు పనులు చేస్తాం.. చేస్తాం.. అంటూ ప్రకటనలకే పరిమితమైపోతోంది. ఆచరణలో అమలు కావడం లేదు. కొత్త రోడ్డు శాంక్షన్ అయినందున ఆ రోడ్డులో ఆర్‌అండ్‌బి శాఖ నుంచి మరమ్మతులకు మళ్లీ నిధులు పెట్టలేమంటూ అధికారులు మెలిక పెడుతున్నారు. కొత్తరోడ్డు వేయడం అటుంచి కనీసం పాతరోడ్డుకు ఏర్పడ్డ గుంతలైనా పూర్తిగా పూడ్చి రోడ్డు బాగుచేయాలని స్థానిక ప్రజలు అధికారులు, కూటమి నేతలను కోరుతున్నారు.

పంట నమోదు తప్పనిసరి



కమలాపురం...మినుమును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, సింహాద్రిపురంలో రైతులకు సూచనలు ఇస్తున్న దృశ్యం

కమలాపురం రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న మినుము, వరి పంటలను జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఏరువాక కేంద్రం నుంచి డాక్టర్ అంకయ్య, ప్రిన్సిపాల్, సైంటిస్ట్ వ్యవసాయ పరిశోధన స్థానం ఊటుకూరు నుంచి డాక్టర్ సునీల్‌కుమార్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మాధురి సీనియర్ సైంటిస్ట్ వ్యవసాయ శాఖ సిబ్బందితో మంగళవారం క్షేత్రస్థాయిలో పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏడీఏ నరసింహారెడ్డి అధ్యక్షతన వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమలాపురం మండల పరిధిలోని దాదిరెడ్డిపల్లె గ్రామంలో 100 ఎకరాల వరకు మినుము సాగు చేశారని, ఈ మధ్య పడిన వర్షాల వల్ల మినుము పంటకు బూడిద తెగులు ఎక్కువగా ఆశించడం గుర్తించామని వారు తెలిపారు. మినుము,వరి పంటలను పరిశీలించామన్నారు. బూడిద తెగులు కాయలు ఆకుల మీద గమనించినప్పుడు సాఫ్ రెండు గ్రాములు ఒక లీటరు చొప్పున లేదా హెక్సాకోనజోల్ రెండు ఎంఎల్ ఒక లీటరు చొప్పున పిచికారీ చేసుకోవాలని శాస్త్రవేత్తలు తెలిపారు. జల్లులు పడినప్పుడు నత్రజని ఎరువులు వాడరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సరస్వతి, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రశాంతి, బాబురైతులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం..: ప్రభుత్వ పథకాలకు అర్హులు కావాలంటే మండలంలోని అన్నిగ్రామాల రైతులు పంట నమోదు తప్పని సరిగా చేయించుకోవాలని ముద్దనూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సింహాద్రిపురంలో ఆయన పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు ఇచ్చారు. పంటల బీమా గడువు ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించడం జరిగిందన్నారు. నానో యూరియా, నానో డీఏపీ వాడటం వలన రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గి, అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో కల్యాణ్‌కుమార్, ఆత్మ బీటీఎం రవికుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్..: పంటలకు మందులు పిచికారీ చేసుకునేందుకు డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించాలని దీని వల్ల ఖర్చు ఆదా అవుతుందని ఏవో చెన్నారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దరంగాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్‌లోసాగుచేసిన ప్రతి పంట నమోదు కావాలని తెలిపారు. అలాగే క్రాప్ ఇన్సూరెన్స్ గడువు ఈనెల 30 వరకు పొడిగించారని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

లింగాల..: మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు సాధ్యం అని ఏవో రమేష్ అన్నారు. లింగాల మండలంలోని దొండ్లవాగు గ్రామంలో మంగళవారం మొక్కజొన్న పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో రైతుల పారదర్శకంగా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

వేంపల్లె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీని వెంటనే అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు డిమాండ్ చేశారు. వేంపల్లెలో మంగళవారం యూటీఎఫ్ సమావేశం నిర్వహించారు. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్య ధోరణి విడనాడాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు జరిగినప్పటికీ ఎక్కడి వారిని అక్కడే ఉంచడం వల్ల ఉపాధ్యాయుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమం తప్పదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రమణ, శ్రీనివాసులు, సుదర్శన్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అక్షయపాత్రకు మెస్‌లను అప్పగించొద్దు

ఆర్‌ఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్

వేంపల్లె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): అక్షయపాత్ర సంస్థకు ట్రిపుల్‌ఐటీ మెస్‌లను అప్పగించొద్దని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ ట్రిపుల్‌ఐటీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ట్రిపుల్‌ఐటీ పరిపాలన అధికారి పెనుగొండ రవి కుమార్‌కు వినతిపత్రం అందించారు. విద్యార్థులకు అక్షయపాత్ర ద్వారా నాన్‌వెజ్ అందించరని, అక్షయ పాత్రకు కాకుండా ఇతర కాంట్రాక్టు సంస్థలకు ఇవ్వాలని ఏఓకు విన్నవించారు.

పింఛన్ అప్పీలుకు దరఖాస్తు చేసుకోవచ్చు

సీకేదిన్నె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పింఛన్ మార్పుతో నోటీసు పొందినవారు అప్పీలు చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో అప్పీలు కోరుతూ ఆధార్‌కార్డు జిరాక్స్, పింఛన్ మార్పు నోటీసు, సదరం సర్టిఫికెట్ పాతది, సదరం సర్టిఫికెట్ కొత్తది, పింఛన్‌దారుకు సంబంధించిన ఏవైనా హాస్పిటల్ బిల్లు ఉంటే డాక్యుమెంట్స్ పెట్టి అప్లై చేసుకోవచ్చన్నారు. అప్పీలుకు జిల్లా ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేదని, ఎంపీడీవో ద్వారా నోటీసు ఇచ్చిన తర్వాత ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంటుందన్నారు. పింఛన్‌దారులు గమనించి అధికారులకు సహకరించాలన్నారు.

'పింఛన్లు తొలగించడం అన్యాయం'

వేంపల్లె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి అర్హత ఉండి వికలాంగ పింఛన్లు తీసుకుంటున్నారు. సర్వే, తనిఖీల పేరుతో అర్హులైన వారికి వికలాంగ పింఛన్లను తొలగించడం అన్యాయమని మండల సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు కటిక చంద్రశేఖర్, మణిగోపాల్‌రెడ్డి, భారతి పేర్కొన్నారు. అర్హత ఉండి రద్దుచేసిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వేంపల్లె మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గాయత్రి ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈసందర్భంగా పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు వికలాంగ పింఛన్లపై అధికారులు చేపట్టిన చర్యలు శోచనీయమన్నారు. మండల సమావేశానికే పలువురు వికలాంగులు వచ్చి సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావడంతో ఉన్నతాధికారులకు పంపిస్తాం, అర్హులైన ప్రతి ఒక్కరికి మళ్లీ పింఛన్ వచ్చేలా చేస్తామని ఎంపీడీఓ కుళాయమ్మ, డాక్టర్ వైద్యనాథ్ తెలిపారు. వేంపల్లె పట్టణంలోని ప్రధానమైన కడప-పులివెందుల రోడ్డులో గుంతలు పడి వాహనదారులకు తీవ్రిబ్బందికరంగా ఉందని సభ్యుల సభదృష్టికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి, ఎస్ఐ తిరుపాల్‌నాయక్, జడ్పీటీసీ సభ్యులు రవికుమార్‌రెడ్డి మండలస్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల కోసం న్యాయసేవల క్లినిక్



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడప రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మాజీ సైనికుల కోసం న్యాయసేవల క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని పేర్కొన్నారు. కడప నగరంలోని జిల్లా సైనిక బోర్డులో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో న్యాయసేవల క్లినిక్‌ను మంగళవారం జిల్లా ప్రధాన జడ్జి యామిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన జడ్జి యామిని మాట్లాడుతూ నల్సా వీర్ పరివార్ సహాయత యోజన 2025 మాజీ సైనికుల కోసం న్యాయసేల క్లినిక్‌ను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. న్యాయసంబంధిత సమస్యల పరిష్కారానికి ఈ క్లినిక్‌ను సందర్శించవచ్చన్నారు. ఈ క్లినిక్‌లో ఒక ప్యానల్ న్యాయవాది, ఒక పారాలీగల్ వలంటీర్‌ను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. వీరు వారంలో రెండు సార్లు ప్రతి సోమ, శుక్ర వారాలలో క్లినిక్‌లో ఉండి మాజీ సైనికుల సమస్యలను తెలుసుకుని వారికి తగు సూచనలను ఇవ్వడం జరుగుతుందన్నారు. లీగల్ సర్వీస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, ఉచిత న్యాయసహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ తదితర అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌లు ఎం. శాంత, ఎస్. చంద్రకాంతమ్మ, ఎం. వినయ్‌కుమార్, మాజీ సైనికుల సంక్షేమ బోర్డు నాయకులు, పారాలీగల్ వలంటీర్లు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

వేంపల్లె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): హోటల్లలో నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కల్తీ ఆహారం అందిస్తున్నట్లు బయటపడితే చట్టరీత్యా చర్యలుతీసుకుంటామని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిణి హరిత హెచ్చరించారు. మంగళవారం వేంపల్లెలోనిఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న ఓ రెస్టారెంట్‌ను ఆమె తనిఖీ చేశారు. పోలీసు బందోబస్తుతో ఈ తనిఖీలు నిర్వహించారు. ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన చికెన్‌నుస్వాధీనంచేసుకొని పారబోశారు. నూనె ఇతరఆహార పదార్థాలను స్వాధీనం చేసుకొని ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని అధికారులు చర్యలు తీసుకుంటారని ఆమె తెలిపారు. ఎక్కడైన కల్తీ ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిస్తే ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

సేవకోసం..ధవళకాంతులు

నర్స్.. సమాజంలో వైద్యులకు సరిసమానంగా విధులు నిర్వహించే మహిళలు, కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రోగులకు సేవలందించేందుకు వివిధ నర్సింగ్ కళాశాల నుంచి విద్యార్థులు నిత్యం ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం నర్సింగ్ విద్యార్థులు ఇలా వరుస క్రమంలో కూర్చోవడాన్ని ఆంధ్రజ్యోతి తన కెమెరాలో క్లిక్‌మని బంధించింది.

ఫొటో : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప



ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

వేంపల్లె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళశారం వేంపల్లె ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి స్వీట్లు, పండ్లు అందించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణ పూర్తి చేయాలి

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం, మామిళ్లపల్లె పంచాయతీ, ఇందిరానగర్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణ త్వరితగతిన పూర్తిచేసి తమకు న్యాయం చేయాలని ఇందిరానగర్‌కు చెందిన పల్లం చంద్రయ్య, ఆయన భార్య రామ్‌లక్షుమమ్మ అవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వారు ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీకి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇందిరానగర్‌లో కిరాణాషాపు నడుపుతూ తాము జీవిస్తున్నామని, వివిధ వస్తువులు కొనేందుకు షాపు వద్దకు జనం వస్తుంటారన్నారు. దీన్ని జీర్ణించుకోలేని అగ్రవర్ణాల వారు అక్కడ నుంచి తమ షాపు తీయించాలనికులం పేరుతో దూషించి, దౌర్జన్యం చేస్తున్నారన్నారు. దీనిపై తాను ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదుచేశానని, ఈ మేరకు సీకెదిన్నె పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. మూడు నెలలు అవుతున్నా సాక్షులను కూడా బెదిరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బాధితుల వెంట మహాజన రాజ్యం పార్టీ అధ్యక్షులు సంగటి మనోహర్, దళిత నాయకులు, పలు ప్రజా సంఘాలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ క్రిష్ణమూర్తి

చాపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చాపాడులోని ఎరువుల దుకాణాలను మైదుకూరు ఏడీఏ క్రిష్ణమూర్తి, ఏవో పద్మలత మంగళవారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని రికార్డులను క్రిష్ణమూర్తి పరిశీలించారు. డీలర్లు రసాయనిక ఎరువులను రైతులకు ఎక్కువ రేటుకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులకు అవసరం ఉన్నన్ని రసాయనిక ఎరువుల బస్తాలు అందుబాటులో ఉంచినట్లు ఆయన చెప్పారు. రైతులు యూరియాను వరిపైరు సాగుకు ఎక్కువగా ఉపయోగించవద్దని అవసరాన్ని బట్టి పైరు పెరుగుదలకు రైతులు రసాయనిక ఎరువులను పలు దఫాలుగా ఉపయోగించాలన్నారు.

పైపులైను కోసం కలెక్టర్‌కు రైతుల వినతి

చాపాడు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమాపురం గ్రామానికి చెందిన కొందరు రైతులు వారి పొలాలకు సాగునీరు అందేందుకు కాలువ ఏర్పాటు చేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు విన్నవించారు. ఆమేరకు ఈనెల 18న గ్రీవెన్స్ కార్యక్రమంలో వినతి పత్రం ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. సోమాపురం గ్రామం వద్ద నేషనల్ హైవే రోడ్డు నిర్మిస్తున్నారని ఈరోడ్డుకు ఇరువైపుల భూములు ఉన్నందున నేషనల్ హైవే వారు రోడ్డు అడుగు భాగంలో పైపులు ఏర్పాటు చేస్తే తమ పొలాలకు సాగునీరు అందుతాయని కలెక్టర్‌కు విన్నవించారు. హైవే రోడ్డు నిర్మిస్తున్న మేఘ కంపెనీవారు పైపులైను ఏర్పాటు చేసేలా చూడాలని వారు కోరారు. అయితే గ్రామంలో కొంతమంది ఉద్దేశ్యపూర్వకంగా పైపులైను ఏర్పాటు చేయవద్దని కాంట్రాక్టర్‌కు అడ్డుపడుతున్నట్లు వారు కలెక్టర్‌కు అందజేసిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పైపులైను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

అర్బన్ సీఐగా లింగప్ప బాధ్యతలు స్వీకరణ



బద్వేలుటౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు అర్బన్‌సీఐగా లింగప్ప బాధ్యతలు చేపట్టారు. ఆయన జమ్మలమడుగు నుంచి బదిలీపై ఇక్కడ కువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కొరకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన తెలిపారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవం



ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

జమ్మలమడుగు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవాన్ని ఫొటోగ్రాఫర్ల యూనియన్ వారు ఘనంగా నిర్వహించారు. ముందుగా వారు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఫొటోగ్రాఫర్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషా మాట్లాడుతూ ప్రపంచ ఫొటోగ్రఫి దినోత్సవం సందర్భంగా రక్తదానం చేయడం సంతోషకర మన్నారు. ఆపదలో ఉన్నవారికి రక్తం ప్రాణదానం చేయడమేనని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు, డాక్టర్లు, ఐసీటీసీ కౌన్సిలర్ ప్రతాప్ పాల్గొన్నారు.

చెత్త ఇలా.. మరి చర్యలెక్కడ..?

● గ్రామీణ ప్రాంతాల్లో పడకేస్తున్న పారిశుధ్యం ● వర్షాలతో బురదమయంగా మారుతున్న రోడ్లు ● ఊసులేని సీజనల్ స్పెషల్‌డ్రైవ్



ఈశ్వర్‌రెడ్డినగర్‌లో పేరుకుపోయిన చెత్తలో పందుల సంచారం

బురదమయంగా మారిన నంగనూరుపల్లె రహదారులు

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన కలిగిస్తున్నా పట్టించుకునేవారులేరు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో డ్రైనేజీలు లేక కొన్నిచోట్ల పూడికలు తీయక మరికొన్ని చోట్ల మురుగంతా రోడ్లపైనే ప్రవహిస్తూ అపరిశుభ్రత తాండవిస్తోంది. ఇక పందుల స్వైరవిహారం, కాటేస్తున్న దోమలతో వ్యాధుల ముప్పు వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో పారిశుధ్యం మెరుగైన చర్యలు కోసం అధికారులు చేపట్టే సీజనల్ స్పెషల్‌డ్రైవర్ ఊసులేకుండాపోయింది. దీంతో పల్లెలు వర్షంధాటికి తడిసి చిగురుటాకుల్లా వణుకుతున్నాయి.

● ప్రొద్దుటూరు మండల పరిధిలో 15 గ్రామ పంచాయతీలకు సంబంధించి 60కిపైగా ఉన్న గ్రామాల్లో సింహభాగం మురుగుపారుదల, కాలువల ఏర్పాటు పనులకు ప్రాధాన్యత లేకపోవడంతో ప్రజారోగ్యం ప్రశ్నార్థకంగా మారింది. కూటమి ప్రభుత్వం తొలి దశలో గ్రామాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేయగా రెండవ విడతలో రూ.4.25 కోట్ల వ్యయంతో పలు చోట్ల కాంక్రీటు రహదారులు ఉపాధి హామీ నిధులను మంజూరు చేశారు. అయితే నరేగా కింద నిధులు కేటాయింపు జరుగకపోవడంతో కాలువ నిర్మాణాలకు అతీగతి లేకుండా పోవడంతో విమర్శలున్నాయి.

నివారణ చర్యలేవీ

దోమల నివారణకు రసాయనాల పిచికారి ఫాగింగ్ తదితర చర్యలు గ్రామాల్లో ఎక్కడా కనిపించడంలేదని స్థానికులు వాపోతున్నారు. వీధుల్లో పారిశుధ్యం మెరుగుపడక దుర్గంధంతో కంపుకొడుతోంది. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండడంతో గ్రామీణ ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఇక ప్రతి శుక్రవారం చేపట్టే ఫ్రైడే డ్రైడే తూతూ మంత్రంగా సాగుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

సమస్యల పరిష్కారానికి కృషి

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలకు అన్ని విధాలా చర్యలు చేపట్టేందుకు గ్రామ కార్యదర్శులకు దిశ, నిర్దేశం చేశాం. మురుగు కాలువల్లో, నీటి కుంటల్లో ఆయిల్‌బాల్స్ వదలడం, కిరోసిన్, రసాయనాలు చల్లడం వంటి చర్యలతో దోమలు అభివృద్ధి తగ్గుతుంది. వర్షాకాలంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఆయా గ్రామ పంచాయతీల నిధులతో చర్యలు చేపడుతాం.

- రామాంజనేయులరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో, ప్రొద్దుటూరు

ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం వద్దు

చిన్న ఆరోగ్య సమస్య అయినా వెంటనే వైద్యు లను సంప్రదించాలి తప్ప ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయవద్దు. వర్షాకాలం అయినందున కాచి చల్లార్చిన నీటిని తాగాలి. దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే ఆరోగ్య ఉపకేంద్రాలు, విలేజ్ హెల్త్‌క్లీనిక్‌లను సంప్రదించాలి. ఇళ్లవద్ద నీటి నిలువలు లేకుండా చూసుకోవాలి. దోమతెరలు వినియోగంతో ప్రయోజనం ఉంది.

- డాక్టర్ హనీఫ్‌బాబా, వైద్యాధికారి, పీహెచ్‌సీ, కామనూరు

వైభవంగా శ్రీకృష్ణ భగవానుని విగ్రహం ఊరేగింపు



తిరువెంగలాపురంలో శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు

పోరుమామిళ్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) :త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక తాడిపత్రి కమిటీ ఆధ్వర్యంలో పోరుమామిళ్ల మండలంలోని తిరువెంగళాపురంలో శ్రీకృష్ణభగవానుని విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో మంగళవారం ఊరేగించారు. గ్రామంలో ఈ నెల 16 నుంచి నాలుగు రోజుల పాటు పూజలు నిర్వహించి మంగళవారం సాయంత్రం ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్థులు అధిక సంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకుడు బాలయ్య, గాజులపల్లె అబ్బిరెడ్డి, పుల్లారెడ్డి, రఘురామిరెడ్డి, పిచ్చయ్య పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం



పూర్ణాహుతి సమర్పిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం పురష్కరించుకుని మృత్యుంజయ హోమంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున అగస్త్యేశ్వరస్వామివారికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, ఉపగ్రహ, ఉపదేవతా, మృత్యుంజయ హోమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేదపండితులు, వేద పాఠశాల గురువు వెంకటేశ్వరశర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సుల్లో నిబంధనలు సడలించాలి



పోరుమామిళ్లలో ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

పోరుమామిళ్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ఉచితబస్సుల్లో మహిళలకు నిబంధనలు సడలించాలని సీపీఐ నాయకులు బద్వేలు ఆర్టీసీ డీఎం నిరంజన్‌ను కోరారు. ఆమేరకు మంగళవారం వారొక వినతిపత్రం అందించారు. పోరుమామిళ్ల ఆర్టీసీ బస్టాండులో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో ఆధార్, గుర్తింపు కార్డు ఒరిజినల్ కావాలని మహిళలను ఇబ్బంది పెట్టడం తగదని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి రవికుమార్ తెలిపారు. ఆధార్ జిరాక్స్ చూపించినా, ఒరిజినల్ అయినా పేరు మారుతుందా, నెంబరు మారుతుందా అన్నారు. స్త్రీశక్తి పథకం వరంలాంటిదని దానికి ఆంక్షలు పెట్టడం తగదన్నారు.

నంద్యాల డయాసిస్ బిషప్‌కు ఘనస్వాగతం



బిషప్ ను సన్మానిస్తున్న యూత్ సంఘం సభ్యులు

ముద్దనూరు ఆగస్టు19(ఆంధ్రజ్యోతి):ముద్దనూరులో నంద్యాల సీఎస్ఐ డయాసిస్ బిషప్ సంతోష్ ప్రసన్న రావుకు సోమవారం ఎస్‌పీజీ(సీఎస్ఐ) చర్చి యూత్ సంఘం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. జమ్మలమడుగు రోడ్డులోని రైల్వే గేట్ల వద్ద నుంచి ఎస్‌పీజీ చర్చి వరకు బిషప్‌ను క్రైస్తవులు ఊరేగింపు నిర్వహించారు. ఆయన ముద్దనూరు ఎస్‌పీజీ చర్చి పాస్టర్‌గా ఉండి నంద్యాల సీఎస్ఐ డయాసిస్‌కు బిషప్‌గా ఎంపికయ్యారు. అందులో భాగంగా చర్చి ప్రత్యేక ప్రార్థనా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. చర్చి అభివృద్ధికి కృషి చేస్తున్న యూత్ సంఘం సభ్యులను ఆయన అభినందించారు.

రైతులు పంట నమోదు చేయించుకోవాలి

కొండాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా పంటనమోదు చేయించుకోవాలని ఏడీఏ రామమోహన్‌రెడ్డి, ఏవో ఏవీరామాంజులరెడ్డిలు తెలిపారు. మండలంలోని బెడుదూరు, బి.కొట్టాలపల్లె గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ రైతు సేవాకేంద్రాలలో ఒక రైతుకు 4 కేజిల కంది మినీకిట్లు అందజేస్తున్నామన్నారు. ప్రతి రైతు భూసార పరీక్షలు తప్పనిసారిగా చేయించుకోవాలన్నారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించాలని కోరారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ జమకాని రైతు రైతుసేవా కేంద్రాల ద్వారా ఈ నెల 25 లోపు అర్జీలు పెట్టుకోవాలని ఏవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన



జీవామృతం తయారు చేసి రైతులకు చూపిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

బి.కోడూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని అమ్మవారిపేట, అయ్యవారిపల్లె గ్రామాల్లోని రైతులకు వారు సాగు చేసిన వరిలో నీటి యాజమాన్య పద్ధతులపై ఏడీఏ మురళీధర్‌రెడ్డి అవగాహన కల్పించారు. మంగళవారం పొలం పిలు స్తోందిలో భాగంగా ఖరీఫ్ 2025లో పంట సాగు చేసిన రైతులందరూ పంట నమోదు చేయంచుకోవాలని అలాగే అన్నదాత సుఖీభవ అర్హులైన రైతులు ఏవైనా సమస్య ఉంటేగ్రీవెన్స్ నమోదు చేయించుకోవ డానికి 20 చివరి తేది అన్నారు. కార్యక్రమంలో ఏఓ కౌశిక, విస్తరణాధికారి తహసీన్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేపై ప్రత్యేక దృష్టి పెట్టండి

కాశినాయన ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి):ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని తహసీల్దారు వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం నర్సాపురం తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డెత్ కేసులు, మ్యుటేషన్‌కు సంబంధించిన అంశాలు ఏమైనా ఉంటే సాధ్యమైనంత త్వరగా పూర్తిచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు పలువురు వీఆర్వోలు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వినతి

జమ్మలమడుగు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గూడెం చెరువు రాజీవ్‌నగర్ కాలనీలోని ముస్లింలకు శ్మశానవాటికకోసం స్థలం కేటాయించాలని జమ్మలమడుగు తహసీల్దారు శ్రీనివాసరెడ్డికి మంగళవారం షా సోషియల్ జస్టిస్ వారి ఇంటర్నేషనల్ సివిల్ హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు అలీషేర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడెం చెరువు రాజీవ్‌నగర్ కాలనీలో దాదాపు 300 కుటుంబాలు నివాసం ఉంటున్నారన్నారు. ఆ ప్రాంతంలో ముస్లింలకు శ్మశాన వాటిక లేదన్నారు. అధికారులు పరిశీలించి శ్మశాన వాటికకు స్థలంకేటాయించాలని కోరారు.

వర్షపు నీటితో రోడ్లు దారుణం



లక్ష్మీనగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

జమ్మలమడుగు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులలో కురుస్తున్న వర్షాలకు రోడ్లు దారుణంగా మారాయి. అడుగు తీసి అడుగు వేయాలన్నా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. లెక్కచేయకుండా ఆ నీటిలోనే తిరిగినవారికి కాళ్ల వేళ్ల మధ్య పుండ్లు లేచి ఆస్పత్రులకు వెళుతున్నారు. అలాగే భాగ్యనగర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, కన్నెలూరు, ఎస్సీ కాలనీ శివార్లలో వర్షపునీరు ఉన్నాయి. కొన్ని చోట్ల డ్రైనేజీ వ్యర్థాలు తొలగించక కంపుతో స్థానికులు అల్లాడుతున్నారు. ఇప్పటికైనా సమస్యలున్న ప్రాంతాలను మున్సిపల్ సిబ్బంది పరిశీలించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మున్నెల్లి రాజుపాలెంలో పరిశుభ్రతకు చర్యలు

● గ్రామంలో వైద్యసిబ్బంది పర్యటన ● ప్రజలకు అవగాహన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గ్రామంలో బ్లీచింగ్ చల్లించి గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

బి.కోడూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మున్నెల్లి రాజుపాలెం గ్రామం లోవైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంల్వో వైద్యసిబ్బంది గ్రామంలో పర్యటించి పరిశుభ్రతపై చర్యలు చేపట్టారు. ప్రజలకు దోమలు వ్యాప్తి వల్ల విషజ్వరాలు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'మురుగులో మున్నెల్లి రాజుపాలెం' అనే కథనం వెలువడింది. దీనిపై స్పందించిన వైద్యాధికారులు ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గురయ్య తన సిబ్బందితో వీధివీధినా బ్లీచింగ్ పౌడరు చల్లించారు. అబేట్ ద్రావణం మురుగునీటిలో పిచికారి చేయడం, గ్రామస్థులకు వివిధ రకాల వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. అలాగే ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అయితే గ్రామంలో అధికారులు మురుగునీరు తొలగించే ప్రయత్నం చేస్తే బాగుంటుందని ఈ సందర్భంగా ప్రజలు వైద్య సిబ్బందిని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజరు జాన్‌విలియం, ఎంఎల్‌హెచ్‌పీ రాజేశ్వరి, ఏఎన్ఎం కుమారి, ఆశా కార్యకర్తలు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

వెలగని వీధిలైట్లు..అంధకారంలో ఎస్సీ కాలనీ



అంధకారరంలో రామేశ్వరం ఎస్సీ కాలనీ

పోరుమామిళ్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామేశ్వరం ఎస్సీ కాలనీలో వీధిలైట్లు వెలగకపోవడంతో కాలనీ అంధకారంలో ఉండిపోతోంది. వర్షాలు కురిసిన కారణంగా రాత్రివేళ బయటికి అడుగు పెట్టాలంటే స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. విషసర్పాలు ఎక్కడ తిరుగుతాయో, ఎప్పుడు ఏమి జరుగుతుందోనని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ కాలనీలో దాదాపు 15 వీధిలైట్లకు సంబంధించిన కరెంటు పోళ్లు ఉన్నాయి. అయితే అవి వెలగకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతోందని కాలనీవాసులు అంటున్నారు. కాగా ఈవిషయంపై ఏఈ వెంకటమహేశ్‌ను వివరణ కోరగా కాలనీలో పరిస్థితిని పరిశీలించి అనంతరం తగు చర్యలు తీసుకుంటామన్నారు.

మున్సిపాలిటీలో పందులు లేకుండా చర్యలు

● కమిషనర్ ఆదేశాలతో తమిళనాడు టీంతో పందుల పట్టివేత



వలవేసి పందులు పట్టిన దృశ్యం

ప్రొద్దుటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ఎట్టి పరిస్థితిలో పందులు కనపడరాదని ఇందుకు తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు. ఆమేరకు మంగళవారం పబ్లిక్ హెల్త్ అధికారులు నూర్‌బాషా, సుబ్బరాయుడుల ఆధ్వర్యంలో పట్టణంలోని నాలుగు శానిటరీ డివిజన్ల పరిధిలో తమిళనాడుకు చెందిన ప్రత్యేక టీం సభ్యులు పందులను వలలు వేసి పట్టుకున్నారు. వైఎంఆర్ కాలనీ అరవింద ఆశ్రమం వీధి బొల్లవరం, దొరసానిపల్లెరోడ్డు, శాంతకుమారి వీధి, ఊటుకూరు వీరయ్య తోట కూరగాయల మార్కెట్, వాసవీ కళ్యాణ మండపం, బాపూజీ నగర్ తదితర ప్రాంతాల్లో దాదాపు 60 పందులను పట్టి తమిళనాడుకు తరలించారు. ఇప్పటికే రెండుదఫాలుగా 50కి పైగా పందులు పట్టామని ఈ పందులు పట్టివేత నిరంతరం కొనసాగుతుందని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు తెలిపారు.

ప్లాట్ల క్రమబద్ధీకరణకు గడువు పెంపు



మాట్లాడుతున్న ప్లానింగ్ ఆఫీసర్

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో జూన్ 30వ తేదీ లోపు వేసిన లేఅవుట్లు, అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకు గడువు పొడిగించినట్లు పట్టణ అభివృద్ధి సంస్థ ప్లానింగ్ ఆఫీసర్ శైలజ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అనధికారిక లేఅవుట్లను రెగ్యులర్ చేసేందుకు వీలు కల్పిస్తూ విడుదలైన జీవో నెం.134పై పంచాయతీ కార్యదర్శులకు, ఎల్‌టీపీలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 30వ తేదీలోపు రిజిస్ట్రేషన్ అయిన అనధికారిక ప్లాట్లు, లేఅవుట్లకు ఈ జీవో వర్తిస్తుందన్నారు. కనీసం ఒక ప్లాట్ అమ్మకం జరిగి ఉండాలని ఈ ఏడాది జూలై 26వ తేదీ నుంచి 90 రోజుల్లోగా క్రమబద్ధీకరణ దరఖాస్తుకు వీలు ఉందన్నారు. ప్లాట్ల లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోలేని పక్షంలో చట్టప్రకారం తీసుకునే చర్యలకు బాధ్యులు అవుతారని వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామాంజనేయరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఎల్‌టీపీలు పాల్గొన్నారు.

పింఛన్ల పునరుద్ధరణకు అవకాశం

ప్రొద్దుటూరు రూరల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లలో ప్రభుత్వం నిలిపివేసిన వాటిల్లో తిరిగి పునరుద్ధరణ చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1వ తేదీన కొన్ని దివ్యాంగుల పింఛన్లను ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. ఎవరైతే పింఛన్‌దారులు పింఛన్ పొందలేదో వారు వారి అనర్హత నోటీసు, సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఎంపీడీవో పేరుమీద వినతి పత్రం సిద్ధం చేసుకుని తమ కార్యాలయంలో అప్పీలు చేసుకుని ఆన్‌లైన్‌లో తిరిగి రీ అసెస్‌మెంట్ పొందాలని చెప్పారు. ఆ తర్వాత సదరం క్యాంపునకు హాజరై పరీక్షలు చేయించుకున్నవారికి తిరిగి పింఛన్ పొందుటకు అర్హత పొందుతారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హైస్కూల్, కళాశాల కోసం స్థలం చదును

కొండాపురం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కొండాపురం జడ్పీహైస్కూల్ గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురి కావడంతో పాఠశాలను కొత్తగా నిర్మించడం కోసం కావలసిన స్థలానికి మంగళవారం కంపచెట్లను తొలగించి చదునుచేశారు. మండల కూటమి నాయకుడు చామలవిష్ణువర్ధన్‌రెడ్డి తన సొంతఖర్చులతో పాతకొండాపురం పునరావాస కాలనీ దగ్గర హైస్కూల్, కాలేజీ స్థలం కోసం ఎక్స్‌కవేటర్‌తో కంపచెట్లను తొలగించారు. రెవెన్యూ అధికారులు జడ్పీహైస్కూల్ కోసం రెండు ఎకరాలు, ప్రభుత్వ కాలేజీ కోసం 1.75 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అయితే ఈ స్థలం విద్యార్థుల ఆటస్థలం కు సరిపోదని, మరింత స్థలం కావాలని కంపచెట్లను తొలగించారు. వాటికి రెవెన్యూ అధికారులు మరింత స్థలం కేటాయించాలని మండల కూటమి ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి కోరారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డిలు సుమారు రూ.12 కోట్ల వ్యయంతో ఇప్పటికే వాటి నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ కార్యక్రమంలో డీలర్ నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో సదరం క్యాంపు



జమ్మలమడుగులో సదరం శిబిరానికి హాజరైన అర్జీదారులు

జమ్మలమడుగు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం సదరం క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరానికి జమ్మలమడుగు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన దరఖాస్తుదారులు, దివ్యాంగులు తదితరులు హాజరయ్యారు. ఉదయం నుంచి మధ్యాహ్నం దాకా ఈ క్యాంపు నిర్వహించారు. సదరం క్యాంపునకు డాక్టర్లు పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి మొత్తం 20 మంది హాజరైనట్లు డాక్టర్లు తెలిపారు.

బార్ అండ్ రెస్టారెంట్‌కు నోటిఫికేషన్

మైదుకూరు రూరల్, ఆగస్ట్ 19(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు మున్సిపాలిటీలో బార్ అండ్ రెస్టారెంట్‌కు నోటిఫికేష్ జారీ చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ దినేష్‌రెడ్డి మంగళవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వంలో బార్ అండ్ రెస్టారెంట్‌లకు మొదటిసారిగా నోటిఫికేషన్ జారీ చేస్తోంది. దరకాస్తు చేసుకోవడానికి ఈ నెల 26 వరకు గడువు ఇచ్చినట్లు దినేష్‌రెడ్డి తెలిపారు. వివరాలకు మైదుకూరు ఎక్సైజ్ శాఖ అధికారులను సంప్రదించాలని ఆయన తెలిపారు.